


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 314, పేజీలు - 08
ఆదివారం, మే 3, 2026 వెల: 5 రూ/.




హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# ఉద్యోగులకు నాలుగు వరాలు

## - పీఆర్సీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

### జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

### - 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

### పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం

2లో..



# మమతా పిటిషన్ తీరస్కరణ

## - కౌంటింగ్ సమీపిస్తున్నా ఈసీపై పోరాటం ఆపని దీదీ
## - టీఎంసీ పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం కోర్టు





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పోలింగ్ ముగిసి, ఫలితాలు మరో రెండు రోజుల్లో వెల్లడికానున్నా కేంద్ర ఎన్నికల కమిషన్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాత్రం తన పోరాటాన్ని ఆపటం లేదు. తాజాగా కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని దీదీ సుప్రీం కోర్టు లో సవాల్ చేశారు. ఈ అంశంపై కలకత్తా హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, అక్కడ కూడా మమతా బెనర్జీకి ఊరట దక్కలేదు. దీనిపై శనివారం విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు, కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయంలో ఎటువంటి తప్పిదం లేదని పేర్కొంది. కలకత్తా హైకోర్టు నిర్ణయం సమర్ధనీయమేనని,

2లో..

## ఉచిత విద్య, వైద్యం

# మా లక్ష్యం

## - మీట్ ది ప్రెస్‌లో కవిత కీలక వ్యాఖ్యలు

- రాష్ట్రంలో అన్ని వర్గాల రక్షణే తమ పార్టీ ధ్యేయమన్న కవిత
- తాము అధికారంలోకి వస్తే పూర్తి ఉచిత విద్యను అందిస్తామని హామీ
- ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందిస్తామన్న కవిత
- జాగృతి ఎన్జీవోగా పని చేస్తుంది, రాజకీయాల కోసమే రక్షణ సేన
- పాంచజన్యం అమలు చేయకపోతే స్తంభానికి కట్టేసి కొట్టండన్న కవిత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తాము ఇచ్చిన పాంచజన్యంలో పేర్కొన్న ఐదు అంశాలను అమలు చేయకుంటే గన్ పార్క్ లోని అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టాలని సూచించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్ట్ లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. తన తండ్రి కేసీఆర్ తో తనకు పంచాయితీ లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయనను విమర్శించానని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు

2లో..



## గ్లోబల్ టీచర్స్..
# గ్లోబల్ చదువు

### - సింగపూర్, ఫిన్లాండ్ విద్యా విధానాల పరిశీలనకు ఏపీ ఉపాధ్యాయులు!



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. కేవలం భవనాల ఆధునీకరణే కాకుండా, బోధనా పద్ధతుల్లో అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు గ్లోబల్ ఎక్స్‌పోజ కల్పించేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే మంత్రి నారా లోకేష్ సంకల్పం ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను విదేశీ అధ్యయన యాత్రలకు పంపడం ద్వారా, అక్కడి అత్యుత్తమ విద్యా విధానాలను మన రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 4 నుంచి 9 వరకు 37 మంది ఉపాధ్యాయుల బృందం సింగపూర్‌లో పర్యటించనుంది.

2లో..

# డిప్యూటీ సీఎంకు చంద్రబాబు పరామర్శ

## - ఆత్మీయ స్వాగతం పలికిన పవన్ దంపతులు

హైదరాబాద్ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు ముక్కుకు సైనస్ సమస్యకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి పరామర్శకు వెళ్లారు. చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ , ఆయన సతీమణి అనా కొణిదెల సాదరంగా ఆహ్వానం పలికారు. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. సర్జరీ తర్వాత వైద్యులు సూచించిన విశ్రాంతి, రికవరీ ప్రక్రియ గురించి ఆరా తీశారు. పవన్ త్వరగా కోలుకుని తిరిగి పూర్తిస్థాయిలో ప్రజాసేవలో నిమగ్నం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తన శస్త్రచికిత్స వివరాలను, ప్రస్తుతం తీసుకుంటున్న జాగ్రత్తలను ముఖ్యమంత్రికి వివరించారు.కేవలం పరామర్శకే పరిమితం కాకుండా, ఈ భేటీలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు,

2లో..



## కాంగ్రెస్ మళ్లీ
# అధికారంలోకి రాదు

## - ప్రజలు మరో 20 ఏళ్లు ఓటు వేయరు

- రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి బాగా పెరిగిపోయిందని ఆరోపణ
- కాంగ్రెస్ అరాచకాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మండిపాటు
- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్న కేటీఆర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి, కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు. ఎన్నికలకు

2లో..



## దేశవ్యాప్తంగా
# మోగిన మొబైల్స్

## - పెద్దశబ్ధంతో సైరన్ అలర్ట్




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పౌరులను తక్షణమే అప్రమత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం దేశవ్యాప్తంగా ఒక కీలక వ్యవస్థను పరీక్షించింది. ఇందులో భాగంగా దేశంలోని పలువురి మొబైల్ ఫోన్లకు ఉదయం 11.46 నిమిషాలకు భారీ శబ్దంతో, వైబ్రేషన్‌తో కూడిన ఒక ఎమర్జెన్సీ అలర్ట్ మెసేజ్ వచ్చింది. దీంతో చాలామంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ఒక పరీక్ష మాత్రమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్'

2లో..

## నీట్ పరీక్షలకు
# భారీ భద్రత

### - ఎగ్జామ్ సెంటర్ల దగ్గర సెక్షన్ 163



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా నేడు జరగనున్న నీట్-యూజీ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. నీట్ పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ అమలులో ఉంటుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం

2లో..

## బతుకమ్మకుంట
# ముమ్మాటికీ చెరువే

## - రూ.18,000 కోట్ల విలువైన భూమి రికవరీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రా చేపట్టిన చర్యల ద్వారా ఇప్పటివరకూ 2 వేలకు పైగా ఎకరాల ప్రభుత్వ భూమిని రికవరీ చేయగా వాటి విలువ రూ.18000 కోట్లకు పైగా ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిందని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఎడ్ల సుధాకర్ అనే వ్యక్తికి 1986 నాటి అన్‌రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే అది చెల్లుబాటు

2లో..

# తెలంగాణలో మందుబాబులకు షాక్!

## - భారీగా పెరగనున్న మద్యం ధరలు!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో మద్యం ప్రియులకు చేదు వార్త. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న మద్యం ధరల పెంపు ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ నెలలోనే ధరల పెంపుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. కేవలం ప్రభుత్వ ఆదాయమే కాకుండా, అంతర్జాతీయ పరిణామాలు కూడా ఈ ధరల పెంపునకు ప్రధాన కారణంగా మారుతున్నాయి.

2లో..

# ఉచిత విద్య, వైద్యం మా లక్ష్యం

వచ్చిన సరే తెలంగాణ ప్రజల కోసం తాను ముందుకే వెళ్తానన్నారు. తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ సాధించటమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎవరైతే విలనో, తనకు కూడా వాళ్లే విలన్ అని చెప్పారు. కేసీఆర్ ను రాజకీయ నేతగానే విమర్శించానని తండ్రిగా ఆయనతో ఎలాంటి సమస్య లేదని టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత చెప్పారు.

### రాళ్లతో కొట్టండి

తెలంగాణ రక్షణ సేన ప్రకటించిన పాంచజన్యం లోని ఐదు అంశాలు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల విషయంలో తాను ఇచ్చిన మాట తప్పితే అమరవీరుల స్థూపం వద్ద స్తంభానికి కట్టేసి కొట్టాలని కల్వకుంట్ల కవిత తెలిపారు. అన్ని విషయాల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే హామీలు ఇచ్చానని చెప్పారు. గత 20 ఏళ్లుగా తనను చూస్తున్నారని ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్నానని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే ప్రజలు 60 శాతం డబ్బు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కచ్చితంగా సంకల్పం తీసుకుంటే ఇది సాధ్యమేనని చెప్పారు. ఆరోగ్య శ్రీ ప్రారంభినప్పుడు, విద్యార్థులకు ఫ్రీ మీల్స్ పెట్టినప్పుడు కూడా ఇది సాధ్యమా అంటూ చాలా ప్రశ్నలు వచ్చాయన్నారు. కానీ ఇప్పుడు వాటిని అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పాంచజన్యంలోని ఐదు అంశాలను అమలు చేయటంపై ఆర్థిక నిపుణులతో చర్చలు జరిపానని కవిత చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో లక్ష కోట్ల రూపాయలను తమ ప్రాధాన్యత అంశాలకు ఖర్చు చేయవచ్చన్నారు. ఆ విధంగా చూస్తే చేయాలన్న సంకల్పం ఉంటే చాలు ఇదంతా సాధ్యమేనని స్పష్టం చేశారు. తల్లిలా తాను పరిణితి చెందుతానంటే చాలా మంది విమర్శలు చేశారని కవిత గుర్తు చేశారు. కానీ తల్లి మాదిరి లాలన లేని కారణంగానే ఇవ్వాళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తల్లి మాదిరిగా ఆలోచిస్తే మాత్రమే ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం వస్తుందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి అది చేతకావటం లేదన్నారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తల్లి మాదిరి పాలన చేస్తామని టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు.

### రాజకీయ నేత కేసీఆర్ పైనే నా విమర్శలు

ఇటీవల కేసీఆర్ పై కవిత చేసిన విమర్శలపై వివరణ ఇచ్చారు. తన విమర్శలు కేవలం బీఆర్ఎస్ అధినేత, రాజకీయ నేత అయిన కేసీఆర్ పైనేనని చెప్పారు. తండ్రిగా ఆయనతో తనకు ఎలాంటి సమస్య లేదన్నారు. సిద్ధాంతపరమైన విబేధాలతోనే విమర్శలు చేశానని...రాజకీయ తప్పులపై భవిష్యత్ లోనూ విమర్శలు చేస్తానని చెప్పుకొచ్చారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంతో చేయాల్సి ఉన్నప్పటికీ కేసీఆర్ అది చేయలేకపోయారన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను సరిగా వాడుకొని ఉంటే రైతుల చేతిలో రెండున్నర లక్షల కోట్లు ఉండేవని చెప్పారు. లక్షా 21 వేల కోట్లు కాళేశ్వరం, పాలమూరు కోసం ఖర్చు చేసి కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో పెట్టిన పరీక్షల్లో పదిసార్లు పేపర్ లీక్ అవటాన్ని ప్రస్తావించారు. కేటీఆర్ లాంటి తెలివైన ఐటీ మినిస్టర్ ఉండగా ఎందుకు పేపర్ లీకైందంటూ ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల కారణంగా రెండు జనరేషన్లు నష్టపోయారన్నారు. లాస్ట్ ఆపర్చునిటీ కాస్ట్ అనే విషయంలో కేసీఆర్ చేసిన తప్పులను మాత్రమే ప్రశ్నించానని టీఆర్ఎస్ అధినేత కవిత స్పష్టం చేశారు.

### పార్టీ పేరు విషయంలో వ్యూహం పాటించాం

తెలంగాణ రాష్ట్ర సేన అని ముందు ప్రకటించిన తర్వాత తెలంగాణ రక్షణ సేన గా పేరు మార్చుకోవటాన్ని జర్నలిస్టులు ప్రశ్నించారు. ఐతే తమ పార్టీ పేరు విషయంలో చాలా కుట్రలు జరిగాయని కవిత చెప్పారు. వాటిని గమనించిన తర్వాతే పార్టీ పేరు విషయంలో వ్యూహత్మకంగా వ్యవహరించామని అన్నారు. కావాలనే రకరకాల పేర్లను ప్రచారంలోకి తెచ్చామని చెప్పారు. ఐతే టీఆర్ఎస్ అనే పేరు రావటం మాత్రం సంతోషంగా ఉందన్నారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉండటం దైవ సంకల్పమేనని భావిస్తున్నానన్నారు. టీఆర్ఎస్ ఏర్పడిన కొత్తలో కూడ బస్సు, నాగలి గుర్తు అంటూ చాలా గందరగోళం జరిగిందని చెప్పారు. పార్టీ ఏర్పాటు చేసే క్రమంలో సాంకేతిక అంశాలు చాలా ఉంటాయన్నారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కల్వకుంట్ల కవిత చెప్పారు.

### విమర్శించే వాళ్లను పట్టించుకోం

కవిత పార్టీ ఏర్పాటును కాంగ్రెస్, బీజేపీ, సహా కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటంపై కవిత స్పందించారు. బీజేపీ నేతలు ముందు తెలంగాణకు మేలు చేసే పని చేయాలని సూచించారు. ఈ నెల 10 న రాష్ట్రానికి వస్తున్న మోడీని అడిగి పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా తేవాలని, తెలంగాణకు ప్రత్యేకంగా నిధులు తేవాలని చెప్పారు. అది చేయకుండా తనను విమర్శిస్తే ఏమొస్తుందని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి బద్ద విరోధి అయిన బీజేపీ, తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలు మాట్లాడే మాటలు పట్టించుకోనని చెప్పారు. ప్రజలకు మంచి చేసేందుకు పార్టీ పెట్టే ప్రయత్నం చేసేప్పుడు ఇలాంటి చాలా మాటలే వస్తాయన్నారు. అసలు ప్రజాస్వామ్యంలో పార్టీ ఉండటమే పవర్ అని చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అన్నది ఆ పార్టీ నడిపే వ్యక్తి సిన్సియారిటీని బట్టి ఉంటుందన్నారు. ఒక పార్టీ గురించి తక్కువ చేసి మాట్లాడుతున్న వాళ్లు వారి మాటలను ప్రజలు గమనిస్తారని గుర్తుంచుకోవాలని కేటీఆర్ ను ఉద్దేశించి వ్యాఖ్యనించారు. టీఆర్ఎస్ పెట్టినప్పుడు జెండా మోసే వాళ్లు కూడా లేరన్నారు. చిన్న పార్టీగా మొదలై వటవృక్షంలా టీడీపీ, బీఆర్ఎస్ లు ఎదిగాయని గుర్తుచేశారు. ఎవరెన్ని విమర్శలు చేసిన దాన్ని మేము మనసు మీదకు తీసుకోమని చెప్పారు. తెలంగాణ ప్రజల సమస్యలపై పోరాటమే తమ లక్ష్యమని కల్వకుంట్ల కవిత చెప్పారు.

### తెలంగాణ కు విలన్ ఎవరో నాకు వాళ్లే విలన్

తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ అని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తనకు టార్గెట్ కాదన్నారు. తెలంగాణకు ఎవరు విలన్ ఉంటే తనకు వాళ్లే విలన్ అని చెప్పారు. తన పర్సనల్ అజెండాను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లనని స్పష్టం చేశారు. తాను ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పారు. పర్సనల్ కష్టాలు, రాజకీయ కష్టాలు ఉన్నాయన్నారు. రాజకీయ కష్టాలను మాత్రమే ప్రజలకు చెబుతానని అన్నారు. తన వెనుక ఎవరు లేరని మరోసారి తేల్చిచెప్పారు. నిప్పుల నుంచి నడిచి వచ్చిన తనకు ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తి ఉందని తేల్చిచెప్పారు. ఎవరో తన వెనుక ఉండాల్సిన అవసరం లేదన్నారు. తన వెనుక తానే ఉన్నానని కవిత స్పష్టం చేశారు.

### పురుషుల కన్నా గొప్పగా నడుపుతాం

తమ పార్టీని పురుషులు నడిపే పార్టీ కన్నా గొప్పగా నడుపుతామని కవిత చెప్పారు. దేశంలో ఎంతో మంది మహిళలు సమర్థవంతంగా పరిపాలించారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో పార్టీని నడుపుతామన్నారు. తమ పార్టీలో కచ్చితంగా మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని కవిత చెప్పారు. మహిళ బిల్లు పాసైన కాకపోయిన సరే తాము మాత్రం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసే ముందు కనీసం వివరణ అడగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటోన్న రోహిత్ రెడ్డి కి మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా క్షేత్రంలో ఉండాలని భావించే తనకు బీజేపీ డీఎన్ఏ తో సరిపోలదన్నారు. తెలంగాణకు అన్యాయం చేసేందే కాంగ్రెస్ అని చెప్పారు. అలాంటి పార్టీల్లో ఉండలేనని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయ్యాక ప్రజల మధ్యలో ఉండాలనే ఉద్దేశంతోనే పార్టీ పెట్టానని స్పష్టం చేశారు. అభివృద్ధి, సామాజిక న్యాయం జోడెద్దులుగా తాము ముందుకు వెళ్తామన్నారు.

### అన్ని రాష్ట్రాలకు ఈక్వల్ పవర్ ఉండాలి

తమ పార్టీ భావసారూప్యం గల పార్టీలతో ఫ్రీ పోల్స్ అలయెన్స్ పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తే అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఐతే భావసారూప్యం లేని వారితో మాత్రం పొత్తులు పెట్టుకునేది లేదన్నారు. పోస్ట్ పోల్ అలయెన్స్ అవసరం ఉంటుందని భావించటం లేదన్నారు. తెలంగాణ ప్రజలకు తమకు పూర్తి స్థాయిలో మెజార్టీ ఇస్తారని భావిస్తున్నానని కవిత చెప్పారు. ప్రస్తుతం తమ దృష్టి అంత కూడా తెలంగాణ రాజకీయాలపైనే ఉందన్నారు. జాతీయ అంశాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే స్పందిస్తామని చెప్పారు. డీలిమిటేషన్ విషయంలో తమకు స్పష్టమైన వైఖరి ఉందని చెప్పారు. అమెరికాలో సెనేట్ కు ఉన్న పవర్స్ మాదిరిగా రాష్ట్రాలకు పవర్ ఇవ్వాలన్నారు. అన్ని రాష్ట్రాలకు ఈక్వల్ ఓటింగ్ రైట్స్ ఉండాలన్నారు. ఈ విషయంలో డీటెయిల్ గా ప్రధాని మోడీకి లేఖను కూడా పంపుతున్నట్లు చెప్పారు.

### మాజీ మావోయిస్టులు పార్టీల్లో చేరాలి

సొంత ప్రజలను డెడ్ లైన్ పెట్టి చంపుతున్నది కేంద్ర ప్రభుత్వమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేపట్టిన దుర్మార్గాన్ని ముందుగా ఖండించింది తానేనని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు ఏదో ఒక పార్టీలో చేరాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందన్నారు. ఇష్యూ బేస్డ్ గా పాదయాత్ర చేస్తామని చెప్పారు. జర్నలిస్టులు, మైనార్టీలు, బీసీ అన్ని వర్గాల కోసం పోరాటం చేస్తామని కవిత చెప్పారు.

### కొత్తదనాన్ని ప్రజలు ఆదరిస్తారు

ప్రజల కోసం ముందుకు వస్తున్న తమకు కచ్చితంగా ప్రజల ఆదరణ ఉంటుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఐతే తన నడవడిక, ఆచరణ చూశాక ప్రజలు తనను నమ్ముతారని తెలుసన్నారు. ఐతే గతంలో కొత్తదనాన్ని ఆహ్వానించిన చరిత్ర ఈ నేలకు ఉందన్నారు.

కచ్చితంగా తమను కూడా ప్రజలు ఆదరిస్తారని నమ్మకం ఉందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక పాంచజన్యం పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ సుధాకర్ రెడ్డి మోడరేటర్ గా వ్యవహరించగా టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రాం నారాయణ పాల్గొన్నారు.

## ఉద్యోగులకు నాలుగు వరాలు

స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

### రెండు నెలలకోసారి సమావేశం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు. "ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

## మమతా పిటిషన్ తిరస్కరణ

దీనిపై తాము ఎటువంటి ఆదేశాలు ఇవ్వబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు టీఎంసీ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఎస్ఐఆర్ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్‌పై దీదీ యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే."ప్రభుత్వ ఉద్యోగులు వారి విధుల్లో భాగంగానే పనిచేస్తారు, అది రాష్ట్రమైనా కేంద్రమైనా వారికి ఎలాంటి పక్షపాతాలు ఉండవు. మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర ఉద్యోగులు ఉండటంలో తప్పేంటి? దీనిపై పూర్తి నిర్ణయాధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది, ఎన్నికల విధులకు సిబ్బంది నియామకంపై రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం సంప్రదించాల్సిన అవసరం లేదు. దీనిని రాజకీయం చేయడం తగదు" అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను తప్పించి, వారి స్థానంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్ని ఈసీ నియమించిందని టీఎంసీ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను ఖండించిన ఈసీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా కొనసాగుతారని స్పష్టం చేసింది. కానీ, అధికార టీఎంసీ శుక్రవారం కోల్‌కతా హైకోర్టులో దీనిపై ఓ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చడంతో సుప్రీం కోర్టులో అత్యవసర పిటిషన్ వేసింది.పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. బెంగాల్ చరిత్రలో తొలిసారి భారీగా పోలింగ్ నమోదయ్యింది. రెండు దశల్లో కలిసి 92 శాతానికిపైగా పోలింగ్ నమోదయినట్టు ఈసీ తెలిపింది. హింసాత్మక ఘటనలు కూడా జరగలేదు. కానీ, రెండో దశ పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద టీఎంసీ ధర్నాకు దిగింది. కానీ, వీటిని కేంద్ర ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. మే 4న ఓట్లను లెక్కించి, ఫలితాలు వెల్లడించనున్న సంగతి తెలిసిందే.

## డిప్యూటీ సీఎంకు చంద్రబాబు పరామర్శ

అభివృద్ధి పనులపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలు, కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలు, రాబోయే అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై ప్రాథమికంగా అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వం చేపట్టబోయే కీలక నిర్ణయాల విషయంలో ఇరువురు అగ్రనేతల మధ్య ఉన్న సమన్వయం ఈ భేటీతో మరోసారి స్పష్టమైంది. ముఖ్యమంత్రి పర్యటనతో పవన్ కళ్యాణ్ నివాసం వద్ద సందడి నెలకొంది. ఎన్నికల విజయం తర్వాత ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడిందనే సంకేతాలు ఈ పరామర్శ ద్వారా వ్యక్తమయ్యాయి. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే ఆయన అమరావతికి తిరిగి వచ్చి విధుల్లో చేరుతారని జనసేన వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి రాక సందర్భంగా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు.

## గ్లోబల్ టీచర్స్.. గ్లోబల్ చదువు

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇలాంటి అంతర్జాతీయ వేదికను కల్పించడం దేశంలోనే ఇదే ప్రథమం.

### సింగపూర్ నమూనాపై ప్రత్యేక దృష్టి

ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణతో కూడిన విద్యా వ్యవస్థ కలిగిన సింగపూర్‌లో ఉపాధ్యాయుల బృందం ఐదు రోజుల పాటు పర్యటించనుంది. ముఖ్యంగా సెకండరీ విద్యా విధానం, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే బోధనా పద్ధతులు, పాఠశాలల నిర్వహణ మరియు, సాంకేతికత వినియోగంపై వీరు క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకోనున్నారు. ఈ పర్యటన అనంతరం, అక్కడి ఉత్తమ పద్ధతులను ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల అవసరాలకు అనుగుణంగా ఎలా మార్చుకోవచ్చనే అంశంపై ఈ బృందం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

### తదుపరి లక్ష్యం.. ఫిన్లాండ్!

సింగపూర్ పర్యటన కేవలం ఆరంభం మాత్రమేనని, జూన్ , జూలై నెలల్లో మిగిలిన ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్లాండ్ పంపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక విద్యలో ప్రపంచానికే దిక్సూచిగా నిలిచే ఫిన్లాండ్ విద్యా విధానంపై మన ఉపాధ్యాయులు అధ్యయనం చేయనున్నారు. మంచి గురువు దగ్గరే మంచి శిష్యుడు తయారవుతాడు అనే నమ్మకంతో, టీచర్ల నైపుణ్యాభివృద్ధికి లోకేష్ ఇస్తున్న ప్రాధాన్యత విద్యా వర్గాల్లో ప్రశంసలందుకుంటోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ఉపాధ్యాయులకు అంతర్జాతీయ శిక్షణ కల్పిస్తామన్న మాటను లోకేష్ నిలబెట్టుకున్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే క్రమంలో ఇది ఒక విప్లవాత్మక అడుగు. ఉపాధ్యాయుల్లో వృత్తిపరమైన గౌరవాన్ని పెంచడంతో పాటు, వారి ఆలోచనా ధోరణిని ప్రపంచ స్థాయికి మార్చడం ద్వారా ఏపీ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్ గా మార్చవచ్చన్నది ఆయన వ్యూహం.

### విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

ఏపీ విద్యాశాఖలో లోకేష్ మార్క్ సంస్కరణలు ఒక స్పష్టమైన మార్పును సూచిస్తున్నాయి. ఐఐటీ మద్రాస్ వంటి సంస్థల సహకారంతో పాఠ్యాంశాల మార్పు, ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్స్ నిర్మాణం, ఇప్పుడు ఉపాధ్యాయుల విదేశీ అధ్యయన యాత్రలు ఇవన్నీ రాష్ట్ర విద్యా రంగ భవిష్యత్తును మారుస్తున్నాయి. ఈ కొత్త ఇనీషియేటివ్ రేపటి తరం విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని తమ ఊరి బడిలోనే పొందేలా దోహదపడనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు ఇతర రాష్ట్రాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ కల్పించడం అనేది విద్యా రంగంలో మన్నికైన, శాశ్వతమైన ఫలితాలను ఇచ్చే ఒక అత్యుత్తమ పెట్టుబడిగా అంచనా వేస్తున్నారు.

## దేశవ్యాప్తంగా మోగిన మొబైల్స్

పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికే ఈ పరీక్ష నిర్వహించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ఈ దేశవ్యాప్త పరీక్షను చేపట్టింది. "మే 2న మీ ప్రాంతంలో ఎన్డీఎంఏ సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్‌లను పరీక్షిస్తుంది. మీ మొబైల్ ఫోన్‌కు సందేశం అందిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. దయచేసి భయపడకండి" అని ఈ సందేశంలో పేర్కొన్నారు. భూకంపాలు, సునామీలు, పిడుగుపాట్లు వంటి ప్రకృతి విపత్తులతో పాటు, గ్యాస్ లీక్‌లు లేదా రసాయన ప్రమాదాల వంటి మానవ తప్పిదాల సమయంలోనూ నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు తక్షణమే హెచ్చరికలు పంపడం ఈ వ్యవస్థ యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ ఇంటిగ్రేటెడ్ అలర్ట్ సిస్టమ్ ను పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సి-డాట్) అభివృద్ధి చేసింది. ఇది అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) సిఫార్సు చేసిన కామన్ అలర్టింగ్ ప్రోటోకాల్ (సీఏపీ) ఆధారంగా పనిచేస్తుంది. గతంలో కూడా ప్రభుత్వం ఈ వ్యవస్థను కొన్నిసార్లు పరీక్షించినప్పటికీ, దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో దీన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ముందు వ్యవస్థ పనితీరును, విశ్వసనీయతను అంచనా వేయడంలో భాగంగానే తాజా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షా సందేశాలు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ ఛానెల్స్ ఎనేబుల్ చేసుకున్న మొబైల్ ఫోన్లకు అందాయి. దేశవ్యాప్తంగా పరీక్షలు పూర్తయిన తర్వాత ఈ మొబైల్ అలర్ట్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

అప్పుడు అన్ని మొబైల్ హ్యాండ్‌సెట్‌లకు బహుళ భారతీయ భాషలలో హెచ్చరికలు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విపత్తుల సమయంలో నష్టాన్ని తగ్గించి, పౌరుల ప్రాణాలను కాపాడటంలో ఈ వ్యవస్థ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## నీట్ పరీక్షలకు భారీ భద్రత

6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. ఈ నోటీసు ప్రకారం, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కుమంది గుమికూడటం నిషిద్ధం. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. పరీక్ష సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కోరారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షలమందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం మూసివేస్తారు. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థులు అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని ఎన్‌టీఏ ఒక అడ్వైజరీ జారీ చేసింది. అడ్మిట్ కార్డు, ఫొటో గ్రాఫ్ తడిచిపోకుండా ట్రాన్స్‌పరెంట్ పౌచ్‌లు ఉపయోగించాలని సూచించింది.

## తెలంగాణలో మందుబాబులకు షాక్!

### మద్యం ధరలు పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి

మద్యం ధరలను పెంచాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉంది. రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి మద్యం ధరలను సవరించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మే నెలలో చివరిసారిగా ధరను పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 మే నెలలోనే మద్యం తయారీ కంపెనీలు ధరలను పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అయితే కొన్ని కారణాలతో అప్పట్లో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది.

### ధరల పెంపునకు ప్రధాన కారణాలు రెండే

ప్రస్తుతం ధరల పెంపునకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన, గ్యాస్ ధరలు పెరిగాయి. మద్యం బాటిళ్ల తయారీకి గ్యాస్ వినియోగం తప్పనిసరి.

గ్యాస్ ధరల పెరగడంతో బాటిళ్ల తయారీ వ్యయం భారంగా మారిందని కంపెనీలు చెబుతున్నాయి. ముడిసరకుల ధరలు, రవాణా ఛార్జీలు, కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రస్తుత ధరలకు మద్యం సరఫరా చేయడం గిట్టుబాటు కావడం లేదని డిస్టలరీలు ప్రభుత్వం ముందు మొరపెట్టుకున్నాయి.

### ధరలు 60 రూపాయల నుంచి 120 రూపాయలకుపైగా పెరిగే ఛాన్స్

ధరల నిర్ధారణ కోసం ప్రభుత్వం ఇప్పటికే ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ వచ్చే వారం తొలిసారి భేటీ కానుంది. డిస్టలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న ప్రచారం ప్రకారం మధ్యే మార్గంగా ధరలను సవరించే ఛాన్స్ ఉంది. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై సుమారు 60 రూపాయలు పెరగొచ్చు. ప్రీమియం బ్రాండ్లకు చెందిన ఫుల్ బాటిల్‌పై సుమారు వందల రూపాయలు పెంచనున్నారు. టాప్ ఎండ్ కేటగిరికి చెందిన ఫుల్ బాటిల్‌పై 120 రూపాయలకుపైగా ధరలు పెంచబోతున్నట్టు సమాచారం.

### తెలంగాణ ఖజానాకు భారీగా ఆదాయం

మద్యం కంపెనీలు భారీగా ధరలు పెంచాలని కోరుతున్నా ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. అయినా ఈ పెంపు కారణంగా రాష్ట్ర ఖానాకు భారీగా ఆదాయం సమకూరనుంది. ఇప్పుడు తీసుకునే నిర్ణయం వల్ల సుమారు 250 కోట్ల అదనపు ఆదాయం నెలకు రానుంది. అదే ఏడాదికి 3000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే

అవుతుందని పేర్కొన్నారు. గతంలో సుధాకర్ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా అతడు పొజిషన్‌లో లేడని పేర్కొంది. కోర్టు ఆదేశాల ప్రకారమే తాము అక్కడ ఉన్న బోర్డులు, ఇతర నిర్మాణాలను తొలగించామని రంగనాథ్ వివరించారు.

### బతుకమ్మ కుంటపై నాసా ఆధారాలున్నాయి

సుధాకర్ అక్కడ అసలు చెరువే లేదని వాదిస్తున్నారని, కానీ అందులో ఏమాత్రం నిజం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కొట్టిపారేశారు. 1975లో ఇరిగేషన్ రికార్డుల్లో కుంటగా పేర్కొన్న ఆధారాలను చూపించారు. సర్వే నంబరు 563/1 లో 9.19 ఎకరాల వరకూ చెరువున్నట్టు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఆ చెరువుకు కట్ట 563/2 సర్వే నంబరులో 6 గుంటల మేర మాసాన్ కట్ట పేరిట ఉందన్నారు. 1990 నాటి నాసా శాటిలైట్ ఫోటోలతో పాటు, 1970 నాటి భారత నీటి సర్వేల రికార్డులను పరిశీలిస్తే అక్కడ పూర్వం నుంచే బతుకమ్మ కుంట ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ ఫొటోలు, వీడియోలను సరిపోల్చుతూ రూపొందించిన వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించారు. పహానీలలో కూడా ఈ చెరువు బతుకమ్మ కుంట, ఎర్రకుంట పేర్లతో నమోదై ఉందని తెలిపారు. సుధాకర్ భూమిని తాము చెరువుగా మార్చామనే ఆరోపణలు వాస్తవం కాదని, తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నామని ఆయన వెల్లడించారు.

బతుకమ్మ కుంటపై తుది తీర్పు వచ్చే వరకూ దీనిమీద ఎవరూ ఓనర్‌షిప్ క్లెయిమ్ చేయకూడదనే కోర్టు నిబంధనల మేరకు బోర్డులు, గేట్లు తొలగించామని తెలిపారు. బతుకమ్మ కుంట చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తే ప్రమాదాలు జరుగుతాయని సుప్రింకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలిపినట్లు చెప్పారు. వివరణతో 3 వారాల్లో అఫడవిట్‌ను దాఖలు చేయాలనిమని సోమవారం సుప్రీంకోర్టు సూచించిందని రంగనాథ్ తెలిపారు.

### హైడ్రా కూల్చివేతలు, చర్యలపై కమిషనర్ రంగనాథ్

ఇతర ప్రాంతాల్లో చేపట్టిన ఆక్రమణల తొలగింపులపై కూడా రంగనాథ్ వివరాలు అందించారు. నార్సింగిలోని ముష్కిన్ చెరువు ఆక్రమణల కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని తెలిపారు.

అలాగే సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై డ్రైవ్ చేపట్టామని, అక్కడ బాధితులంతా పేదలే ఉన్నందున 1500 ఇళ్లను కూల్చివేయలేదని స్పష్టం చేశారు. ఫాతిమా కాలేజీ వివాదంలో హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎఫ్‌టీఎల్ (ఎఫ్టీఎల్) డిమార్కేషన్ చేయాల్సి ఉందని తెలిపారు.

### 2093 ఎకరాలు రికవరీ చేసిన హైడ్రా

హైడ్రా ఇప్పటివరకు చేపట్టిన చర్యల ద్వారా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందని రంగనాథ్ వెల్లడించారు. మార్కెట్ ధరల ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.18,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఆక్రమణలు, ఇతర నిబంధనల ఉల్లంఘనలపై ఇప్పటివరకు హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా హైడ్రా తన కార్యకలాపాలను కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు

ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే

**- ''ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'' ముఖ్య ఉద్దేశ్యం**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్** ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్ వేదికగా "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ గీతాలాపనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, విద్య, వైద్యం, అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించమని అన్నారు. వచ్చేవారం రైతు వారోత్సవాలు, తదితర కార్యక్రమాలు ప్రణాళిక అనుగుణంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరుస్తుందని, త్వరలోనే ఇందిరమ్మ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్, తదితర మరిన్ని నూతన పథకాల అమలుకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో, డివిజన్ స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట గడువు ఉంటుందని చెప్పారు.

ఇటీవల వెల్లడైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచిందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రభుత్వం ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అనే 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని అమలుపరుస్తుందని వివరించారు. ప్రభుత్వము అమలు పరుస్తున్న పథకాల వల్ల ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గానికి 6 వేల 155 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. 53 వేల కుటుంబాలకు 200 యూనిట్ల సబ్సిడీ విద్యుత్ అందుతుందని వివరించారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర ఎన్నో పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు మొదలుకొని యూనివర్సిటీల వరకు విద్యాభివృద్ధికి చొరవ చూపుతోందని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారుల తోడ్పాటు అవసరం అన్నారు. ఇటీవలి వివిధ ప్రమాదాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులను ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు అభినందించారు. శాలువాలతో సన్మానించారు. మహిళా సంఘాలకు మంజూరైన పలు చెక్కులను పంపిణీ చేశారు.

దివ్యాంగులకు మంజూరైన 95 వేల రూపాయల విలువగల స్కూటీలు, ల్యాప్ టాప్ లు పూర్తి సబ్సిడీతో అందించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పడిగెల భూషణ్, లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో రెజ్లింగ్( కుస్తీ )

**- జూడో శిక్షణ శిబిరం**

ఆళ్లగడ్డ ఆళ్లగడ్డలో వేసవి శిక్షణ శిబిరం రెజ్లింగ్ ( కుస్తీ) జూడో శిక్షణ ఇస్తున్నట్లు నంద్యాల జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ ఎం సుబ్బారెడ్డి మరియు నంద్యాల జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ రాబర్ట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ డిప్యూటీ తాసిల్దార్ నర్సిరెడ్డి నంద్యాల జిల్లా పీఈటి అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎల్ ప్రతాప్ మాథ్స్ టీచర్ శంకర్ రెడ్డి గారు ఆహ్వానితులు అయినారు డిప్యూటీ తాసిల్దార్ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డలో గత రెండు సంవత్సరాల నుండి క్రీడలో దినదిన అభివృద్ధి చెందుతున్న వి క్రికెట్,హ్యాండ్ బాల్, ఫుట్బాల్ ఫిజికల్ ఫిట్నెస్తో మంచి శిక్షణ ఎక్కడ ఇస్తున్నారు అని క్రీడల్లో ఇంకా ముందుకు వెళ్లి రాయలసీమ డిఫెన్స్ అకాడమీ వారు రెజ్లింగ్ (కుస్తీ ) జూడో ఒలంపిక్స్ సంబంధించినటువంటి క్రీడలలో పట్టణ ప్రాంతాల్లో మాత్రమే వీటికి శిక్షణ ఇస్తారు అని కానీ ఆళ్లగడ్డలో ఈ శిక్షణ శిబిరం తో పాటు అకాడమీ ని కూడా ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని డిప్యూటీ తాసిల్దారు నర్సిరెడ్డి అన్నారు రాబర్ట్ గారు మాట్లాడుతూ తాను 30 సంవత్సరాల నుండి రెజ్లింగ్ లో క్రీడాకారుల శిక్షణ ఇస్తూ కర్నూలు నంద్యాల జిల్లా. ల సెక్రటరీగా కొనసాగుతున్నాను అని నంద్యాల జిల్లా రెజ్లింగ్ చైర్మన్ ఎన్ సుబ్బారెడ్డి గారి మాట మేరకు ఆళ్లగడ్డ రాయలసీమ డిఫెన్స్ కోచింగ్ సెంటర్ లో ఈ అకాడమీ ఏర్పాటు చేశామని రాబర్ట్ అన్నారు ఎన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నా చిన్నతనం నుండి క్రీడలు అంటే నాకు ఎంతో ఇష్టమని పాఠశాల దశ నుండే నేను క్రీడాకారుడిని కాబట్టి ఆళ్లగడ్డలో రెజ్లింగ్ అకాడమీ ని ఏర్పరించేంతవరకు తీసుకువచ్చింది అని చెబుతూ ఆళ్లగడ్డ నుండి రెజ్లింగ్లో వివేకానంద ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో సిల్వర్ మెడల్ సాధించడం జరిగినది ఇంకా శిక్షణ ఇస్తే ఉన్నత స్థాయిలో ఉంటాడు అనే ఉద్దేశంతో రెజ్లింగ్ అకాడమీ ఆళ్లగడ్డలో రాయలసీమ డిఫెన్స్ అకాడమీ లో ఏర్పాటు చేశానని ఈ క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి కోచ్ సుబ్బరాయుడు రాయలసీమ డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు

# కొలిమిగుండ్లలో పర్యటించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి...



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఇవాళ రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి కలిసి పర్యటించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు కలిసి పూలతో ఘనస్వాగతం పలికారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తన సొంత నిధులు 9 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ రాజకుమారి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంయుక్తంగా కలిసి ఘనంగా ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.

అనంతరం మండలంలోని హనుమంతు గుండం గ్రామంలో జలధార జలహారతి కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం చెరువుల పునరుద్ధరీకరణ మరియు చెరువుల కలయిక పనులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పనిచేస్తుందని గ్రామాల అభివృద్ధి తమ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, వి ఆర్. లక్ష్మిరెడ్డి, అంబటి జయలక్ష్మి రెడ్డి, అంబటి వివేకానంద రెడ్డి, అంబటి ప్రకాష్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుసేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కోటపాడు శివారెడ్డి, పులి ప్రకాశ్ రెడ్డి, బెలుము రఘురామిరెడ్డి,మందా విజయ్, వేణు యాదవ్, పల్లె వెంకటేశ్వర్ రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, ఎర్రగుడి రాజగోపాల్, నిమ్మకాయల దస్తగిరి, పాతపాటి రామ్మోహన్ రెడ్డి, నరసింహులు, ప్రసాద్, సత్య, రవికుమార్ ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 8,9,10 తేదీల్లో స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**బద్వేలు** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు వైశాఖ,మాసం ప్రారంభంతో మూడవ శనివారం సందర్భంగా వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణ పలు రకాల పుష్పలాతో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు, తదుపరి ఆలయ నిర్వహకులు గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ 8 వ తేదీన ధ్వజారోహం,గణపతి పూజ, నవగ్రహ శాంతి హోమం,నరసింహ స్వామి హోమం,వేద ఆశీర్వాదం అన్న ప్రసాద కార్యక్రమం,9వ తేదీన పలు రకాల పండ్ల రస ద్రవాళ్లతో అభిషేకం,రాహు కాల హోమం,స్వామి వారి తిరు కళ్యాణం,చాందిని బండ్ల ఉత్సవం,గ్రామ్మోత్సవం,10 వ తేది న సహస్రనామం పూజ,పులంగి సేవ,బండ్ల ఎద్దుల పోటీలు అని తెలిపారు,ప్రతి ఒకరు సకుటుంబ సమేతగముగా స్వామి వారి పూజ,తిరు కళ్యాణం ను తిలకించి స్వామి వారి కళ్యాణ తాంబూలం,సంపూర్ణ ఆశీర్వాదం పొదగలరు అని ఆలయ నిర్వహకులు తెలిపారు,తదుపరి స్వామి వారిని దర్శించడం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది,అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు పోలు. రమణయ్య ధర్మపత్ని కుమారి నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

# ఉపాధి పనులలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు...

**- అడిషనల్ పిడి మాధవి లత**

**- మండలంలోని పలు జీ.పీ లలో తనిఖీ చేసిన అడిషనల్ పీడీ**



**తుగ్గలి:** ఉపాధి పనుల నిర్వహణలో అవకతవకలు జరిగి అవినీతికి పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా అడిషనల్ పిడి మాధవి లత తెలియజేశారు. శనివారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల ముక్కెళ్ల,మారెళ్ళ,చెన్నంపల్లి,తుగ్గలి గ్రామ పంచాయతీలలో ఉపాధి కూలీలు చేసినటువంటి ఉపాధి పనులను ఆమె పరిశీలించారు.ఉపాధి మండలాధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పలు గ్రామాలలో హార్టికల్చర్ పనులను కూడా ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులలో ప్రతిరోజు నాలుగు గంటల నిడివితో రెండు ఫోటోలను తప్పకుండా తీసుకొని యాప్ నందు పొందపరచాలని ఆమె తెలియజేశారు.ఉపాధి పనులు చేసిన వారికి మాత్రమే వేతనాలను చెల్లించాలని ఆమె తెలియజేశారు.ఉపాధి పనులలో నాణ్యతే ప్రామాణికంగా తీసుకొని ఉపాధి పనులను అధికారులు నిర్వహించాలని ఆమె తెలియజేశారు.టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు ఇచ్చి ఉపాధి పనులను నిర్వహించాలని ఆమె తెలియజేశారు.ఎండలు ఎక్కువగా ఉండడం వలన ఉపాధి కూలీలందరూ పలు జాగ్రత్తలను పాటించి ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.ఇప్పటినుండి ప్రతివారం వచ్చి ఉపాధి పనులలో తనిఖీలు నిర్వహిస్తామని అడిషనల్ పీడీ మాధవి లత అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ ఏపీడి లక్ష్మణ్, తుగ్గలి ఏపీఓ రామకృష్ణ,ఈసీ రాజశేఖర్,టెక్నికల్ అసిస్టెంట్ జయరాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేంద్ర,సీనియర్ మేట్ అక్బర్ తదితర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సభల ద్వారా భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నాం

**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల** అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కింద వేములవాడలో నియోజకవర్గ స్థాయి సభ శనివారం నిర్వహించగా,ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ వీడియో పాటను ప్రదర్శించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పనులపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.నేతన్నలకు భరోసా కింద రూ. 4,06,500, కళ్యాణ లక్ష్మి చెక్కులు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల బాధ్యులకు శానిటరీ నాప్కిన్స్ ఇన్సినేటర్స్, దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ఫుడ్ స్టాల్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ ఉత్పత్తులు, సన్న వరి సాగు, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రం, పోషణ మాసం, బాలల భద్రత.. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల స్టాళ్లను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో గ్రామంలో గ్రామ సభలు, మండల స్థాయిలో సభలు పూర్తి చేసుకొని నియోజకవర్గ స్థాయిలో సభలు ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.ఆయా సభల్లో గ్రామంలోని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని, వారందరికీ అభినందనలు తెలియజేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు.విద్యార్థులు తమకు ఆటలు ఆడాలని, కచ్చితంగా చదవాలని తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం చేయాలని, ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. డ్రాప్ ఔట్ కావద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకుల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ రాధాభాయ్, సీపీఓ శ్రీనివాసాచారి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్టు

**పిడుగురాళ్ల** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణ శివారులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుంజి రామాంజనేయులు, దేవళ్ళ లక్ష్మీనారాయణ, బత్తుల హృదయరాజు, భాగం పిచ్చయ్య, కొమెర శివ బాలాజీ, సన్నాయిల కుమారస్వామి అనే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 9 కిలోలు 898 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారు దాచేపల్లి, అమరావతి, పిడుగురాళ్ల ప్రాంతాలకు చెందినవారని గుర్తించినట్లు గురజాల డీఎస్పీ మహేశ్వరరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# నేతలు హుందాగా వ్యవహరించాలి

**విశాఖపట్నం** ప్రజా సమస్యలపై విశాఖలో మేధోమథన సమ్మేళనం జరిగింది.ఈ సమ్మేళనంలో విశ్రాంతి ఐపిఎస్ అధికారి వేంకటేశ్వర రావు,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ప్రాంతీయ విభేధాలు రెచ్చగొట్టే విదంగా రాజకీయ నేతలు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడ్డారు.సోషల్ మీడియాను వక్రీకరించేలా నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు.రాజకీయ నేతలు హుందాగా ఉండేలా వ్యవహరించారని,రాయలసీమలో జరుగుతున్న దోపిడీ ఇప్పుడు ఉత్తరాంధ్రకు విస్తరించిందని అన్నారు.రాజకీయ నేతలు వారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అన్నారు.

# ఐదు రోజులపాటు వాతావరణంలో మార్పులు

**విశాఖపట్నం** రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారి జగన్నాథ్ కుమార్ వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ వాతావరణ మార్పులు ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపనున్నాయి.

# నారాయణపురంలో దొంగల హల్ చల్

**దాచేపల్లి** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించిన దుండగులు నగదు, బంగారం, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. బాధితుల అంచనా ప్రకారం సుమారు 25 లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న గురజాల డీఎస్పీ ఉమామహేశ్వరరావు, దాచేపల్లి సీఐ రాజేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

**- శాఖల వారీగా సమస్యల పరిష్కారం**

**నియోజకవర్గస్థాయి సమావేశంలో: కలెక్టర్ చిత్ర మిశ్రా**



**కరీంనగర్** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగా శాఖల వారీగా సమస్యలు పరిష్కరిస్తూ అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చిత్రమిశ్రా పేర్కొన్నారు. శనివారం గంగాధర మండలం పాపాయ పల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చొప్పదండి నియోజకవర్గం స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, నియోజకవర్గస్థాయి క్లస్టర్ ఆఫీసర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డిఓ మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్త్రీ శిశు సంక్షేమం, స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇల్లు, ప్రజావాణి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి భారీగా దరఖాస్తులు పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ పథకాలు పొందిన, పొందుతున్న లబ్ధిదారుల వివరాలు వివరించారు. రైతు బీమా, కళ్యాణి లక్ష్మి, రైతు భరోసా, మహాలక్ష్మి, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్లు , అంగన్వాడి కేంద్రాల సేవలు, ఆయిల్ ఫామ్ సాగు వివరాలు వివరించారు

# చలివేంద్రాలు ఏర్పాటు



**శ్రీశైలం** భక్తుల సౌకార్యార్థం దేవస్థానం పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. దేవస్థానీ వైద్యశాల ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈ రోజు (02.05.2026) కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా దేవస్థానం ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ చలివేంద్రాలలో చల్లని మంచినీటితో పాటు మజ్జిగ కూడా భక్తులకు అందజేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా కరివేన సత్రం, ఆర్టీసి బస్టాండు, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలైన చోట్ల కూడా ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ చలివేంద్రాలలో శివసేవకుల స్వచ్ఛంద సేవలను వినియోగించుకోడం జరుగుతోందన్నారు. దేవస్థానం సూచనల మేరకు పలు సత్రాల వారు కూడా ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులందరికీ కూడా ఈ చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమములో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడ్డి, శివ సేవకుల విభాగపు పర్యవేక్షకులు టి.హిమబిందు, అన్నప్రసాద వితరణ విభాగపు పర్యవేక్షకులు పి.దేవిక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎకరంన్నర భూమిలో 55 క్వింటాళ్ల మిర్చి దిగుబడి

## - సత్తా చాటిన మిర్చి రైతు శ్రీను



**సుజాతనగర్ (ప్రశ్న న్యూస్)** సాధారణ సాగులో అసాధారణ ఫలితం సాధిస్తూ సుజాతనగర్ మండలానికి చెందిన రైతు దొంతుల శ్రీను ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. మేఘన సీడ్స్‌కు చెందిన భగవాన్ 2535 మిర్చి రకాన్ని ఎంచుకుని ఎకరంన్నరలో సాగు చేసిన ఆయనకు 55 క్వింటాళ్ల దిగుబడి రావడం విశేషం. సాధారణంగా ఈ స్థాయి విస్తీర్ణంలో ఇంత అధిక దిగుబడి రావడం అరుదే. అయితే నాణ్యమైన విత్తనం, సమయానికి ఎరువుల వినియోగం, పంట సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని శ్రీను తెలిపారు. పంట ప్రారంభం నుంచే శ్రద్ధగా పర్యవేక్షిస్తూ, అవసరమైన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడిని పెంచగలిగారు.ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చికి ఉన్న డిమాండ్ దృష్ట్యా, ఈ దిగుబడి రైతుకు మంచి ఆదాయం తీసుకురానుంది. శ్రీను విజయంతో స్థానిక రైతుల్లో ఆసక్తి పెరుగుతుండగా, భగవాన్ 2535 రకంపై మరింత నమ్మకం పెరిగింది. ఇలాంటి ఆధునిక సాగు పద్ధతులు అనుసరిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. శ్రీను సాధించిన ఈ ఫలితం ఇతర రైతులకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

# నల్లచెరువు కట్ట చెట్ల నరికివేతపై గ్రామస్తులు ఆందోళన

## - సర్పంచ్ ఆమె భర్త చెట్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) మొక్కలు పెట్టి చెట్లు గా పెంచి పర్యావరణన్ని పరిరక్షించవలసిన ప్రజా ప్రతినిధులు వాటితో సొమ్ము చేసుకుంటున్న వైనం పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటి చెట్లు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదాలు వదలేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో నల్లచెరువు కట్ట పరిసరాల్లో జరుగుతున్న చెట్ల నరికివేతపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని నల్లచెరువు కట్టకు ఇరువైపులా ఉన్న చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారని స్థానికులు గమనించారు. ఈ విషయం గురించి ప్రశ్నించగా, గ్రామ సర్పంచ్ ఆమె భర్త తాళ్ళ ఆంజనేయులు గౌడ్ ఆదేశాల మేరకు చెట్లు నరుకుతున్నామని కొందరు తెలిపారు అని గ్రామస్తులు చెబుతున్నారు.అయితే ఈ నిర్ణయం గురించి కనీసం వార్డ్ మెంబర్లకు లేదా ఉప సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా, సర్పంచ్ ఆమె భర్త ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తప్పు జరిగినట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 99 రోజుల ప్రగతి పాలనపై అవగాహన సదస్సు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారం ఆలేరు నియోజకవర్గంలోని ఇమ్మడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్ నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించుటకు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేయాలనుకున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు ఎంతోమంది పేద ప్రజల లబ్ధిదారులకు చేరుతుందని, ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడంలో చేసే పని చిత్తశుద్ధితో జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, వార్డు మెంబర్లు పని చేయాలన్నారు.ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ. ప్రభుత్వ సంక్షేమాన్ని పేద ప్రజలకు అందించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి ముందుకు సాగాలని దానికి ప్రతి ఒక్కరి కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించాలనదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 100% లబ్ధిదారులకు అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామాలలో పార్టీలకు అతీతంగా పని చేసి గ్రామాభివృద్ధిలో తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమల వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో లు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారలు, లబ్ధిదారులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సీలింగ్ భూముల కబ్జా నిగ్గుతేల్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం.

## - బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్యాయంగా కబ్జా చేసిన సీలింగ్ భూముల నిగ్గు తేల్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో దీక్షలను చేపడతామన్నారు. శనివారం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. మండలంలోని సైదాపురం, మాసాయిపేట గ్రామాలలో సర్వే నంబర్ 322, 728లలో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమి సుమారు 1200 ఎకరాలను స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఓ వెంచర్ తో కుమ్మక్కై అక్రమంగా వెంచర్ నిర్వహించి రూ. కోట్లకు పడగెత్తారని అన్నారు. నిరుపేదలకు ఆక్రమంగా ప్లాట్లను కట్టబెట్టారన్నారు. ఇప్పుడు వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఎంతో మంది నిరుపేదలు ఫ్లాట్లను కొనుగోలు చేశారన్నారు. ఒక్కో ప్లాట్లను ముగ్గురు నుంచి నలుగురికి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. మాసాయిపేట గ్రామంలో సీలింగ్ భూమల కబ్జాలను వెలికితీసి నష్టపోయిన బాధితలకు అందజేయాలని గత రెండు వారాల క్రితం కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రీవెన్ లో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ వెంకారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. గత కొన్నేళ్లుగా సీలింగ్ భూమిలో ఎమ్మెల్యే దీక్ష అయిలయ్య చేపట్టిన అవకతవకలను వివరించామన్నారు. ఇందులో ఏఏ అధికారుల ప్రమేయం ఉందో వివరాలను అందజేశామన్నారు. కానీ ఇప్పటి వరకు అధికారులు విచారణ జరుపలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాకముందే కార్లు, విలాసవంతమైన భవనాలు, ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థను నడిపానంటూ గతంలోనే నేను కోటీశ్వరుడిని అని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పత్రికా సమావేశంలోనే తెలిపిన విషయాన్ని గుర్తు చేశారన్నారు. ఇన్ని కోట్ల ఆస్తులున్న ఎమ్మెల్యే ఎన్నికల సంస్థను సమర్పించిన అఫిడవిట్లో ఎందుకు తన ఆస్తులను చూపించలేదో చెప్పాలన్నారు. దీనిపై త్వరలో ఎన్నికల కమీషన్, ఏసీబీకి పిర్యాదు చేస్తామని అన్నారు. విలేకరులకు ఒక్కొక్కరికి ఎకరం భూమిని రాసిస్తామని మాటలు చెప్పి తప్పించుకోవద్దని ధమ్ముంటే ఇచ్చిన మాట ప్రకారం ఆలేరు నియోజకవర్గంలో ఉన్న విలేకరులకు ఎకరం భూమి రాసివ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ లో ఇచ్చిన పిర్యాదు పై అధికారులు తక్షణమే స్పందించాలని లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడితోపాటు ప్రతి మండల కేంద్రంలో దీక్షలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మాజీ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్ యాదవ్, నాయకులు కల్వకొలను సతీశ భట్, జీ రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత

**దుబ్బాక** శనివారం నాడు జరిగిన దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత తలెత్తింది. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నిలదీసారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతుండగా అధికారులు మైకులు కట్ చేసారు. దీంతో ఆగ్రహంతో ఎమ్మెల్యే మైకులను నేలకేసి కొట్టివేసారు. వడ్ల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని నేలపై కూర్చొని నిరసనకు దిగారు.

# నవ దంపతుల ఆత్మహత్య



**హైదరాబాద్** ప్రేమించి పెళ్లి చేసుకొని, నెల రోజులు గడవక ముందే జంట ఆత్మహత్య చేసుకుంది. కూకట్ పల్లిలో మార్చి 8వ తేదీన ప్రేమించుకున్న కార్తీక్, మంజుల చి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుననారు. కానీ నెల రోజులు గడవక ముందే నవ దంపతుల ఆత్మహత్య బంధువులు విషాదంలో ముంచివేసింది. ఉరేసుకొని ఒకరు.. విషం తీసుకొని మరొకరు బలవన్మరణం చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

# శ్రీ లక్ష్మీ నరసింహా స్వామికి వైభవంగా నిత్య పూజలు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణం యాదగిరిగుట్ట దేవస్థానంలో శనివారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూవులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభులను సువర్ణ ప్రతిష్ట మూర్తులను వేదమంత్రోచరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకారమంటపంలో నృసింహ హోమం, నిత్య కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణమును చూచి భక్తులు భక్తి పారవశ్యంలో తేలిపోయారు.సాయంత్రం వెండి జోడు సేవ స్వామివారు తిరువీధులలో ఊరేగారు. కొండపైన అనుబంధ ఆలయం అయినా శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర ఆలయంలో ప్రతినిత్యం స్పటిక లింగ దర్శన ని ఏర్పాటు చేశారు. భక్తులు సాంప్రదాయ దుస్తులను ధరించి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈనెల 5 మంగళవారం రోజున హుండీ లెక్కింపు కొండ కింద వ్రతమంటపశీ ఆల్ నెంబర్ 2 లో లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈవో భవాని శంకర్ ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్య రాబడి 40,25,206. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కు వివిధ శాఖల నుండి వచ్చిన ఆదాయం 40,25,206 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# చిరు వ్యాపారం చింతలేని వ్యాపారం

## - ఆలోచన అద్భుతం ఆచరణ స్ఫూర్తి - పనులు లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు

(దుర్గం విజయ్ బాబు --ప్రశ్న న్యూస్ బ్యూరో)



కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనేది పాత తరం భావజాలాన్ని పట్టుకుని, కొత్త ఆలోచనలను అంగీకరించని యువతను ఉద్దేశించి అనే సామాజిక విమర్శ. వీరు పాత ఆచారాలకు, తాతల నాటి ఆలోచనలకు దాసులుగా ఉంటూ, నూతిలోని కప్పల్లా పరిమిత పరిజ్ఞానంతో నేటి వాస్తవాలను చూడలేకపోతున్నారని జగమెరిగిన సత్యం. కానీ నేటి యువత మాత్రం సరికొత్త ఆలోచనలతో దూసుకెళ్తున్న తీరు మాత్రం పలువురికి స్ఫూర్తిని కలిగిస్తుంది. చిరు వ్యాపారాలు చేస్తూ చేతినిండా సంపాదిస్తూ కుటుంబాలతో సంతోషంగా గడుపుతున్న యువకులకు పై ప్రత్యేక కథనం

### - మిర్చి బండి అని తక్కువగా చూడొద్దు వేలల్లో ఆదాయం



మధ్యతరగతి కుటుంబాల్లో గడవలంటే ఏదో ఒక పని చేయాలి నెలంతా చేస్తే వచ్చే జీతం 10 వేలు లేదా 20 వేల వరకు మాత్రమే వస్తుంది. వచ్చే జీతం ఎటు సరిపోతుంది అందులో నుండి రూమ్ రెంట్ రేషన్, కరెంటు బిల్లు, పంపు బిల్లు, పిల్లల ఖర్చులూ ఇలా ఎన్నో ఇబ్బందులుంటాయి, ఉద్యోగం మానేసి ఏదైనా చేద్దామంటే సక్సెస్ అవుతాము కాదో అన్న భయంతో పెట్టుబడి పెట్టలేక చేయలేక పోతారు, కానీ కొంచ ధైర్యం చేసి చిన్న గా పెట్టుబడితో నెలకు జీతం కన్నా నాలుగింతల సంపాదన చేస్తూ మరొకరికి కూడా ఉపాధి చూపించవచ్చు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ కు చెందిన మారుపాక పరశు రాములు కొద్ది రోజులు బతుకుదెరువు నిమిత్తం దుబాయ్ వెళ్ళాడు. చాలీచాలని జీతం చేసిన అప్పులు తీరక ఇంటి దారి పట్టాడు. రోజు కూలి కి వెళితే వచ్చే డబ్బులు ఎటు సరిపోయివువి కావు దీంతో బాగా ఆలోచించి చిన్నగ మిర్చి బండి పెట్టాడు, అప్పుడు అందరు చూసి ఎగతాళి కూడా చేసారు, పనికి వెళ్తే నాలుగు పైసలు వస్తాయి కానీ, పని చేయకుండా మిర్చి బండి పెట్టడం ఏమిటి అని. పరశురాములు మాత్రం అవేవి పట్టించుకోకుండా తన మిర్చి బండిని యధావిధిగా కొనసాగించాడు.పెట్టిన కొన్ని రోజులకే పరుశరాములు మిర్చి బండి వద్ద దొరికే మీర్చికి చాలా మంది ఫ్యాన్స్ అయిపోయారు, అలా ఒకరి నుండి ఒకరికి ఇక్కడ మిర్చి బాగుంటుంది అని ఉచితంగా పబ్లిసిటీ జరిగింది దింతో పరశు రాములు మిర్చి బండి వ్యాపారం వేగంగా పుంజుకుంది. పరుశరాములు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ క్వాలిటీ నీ ఉపయోగించడం తో ఇక్కడే మిర్చీలు తినడానికి క్యూలో నిలబడి మారు తీసుకుంటారు జనాలు. అలా గిరాకీ పెరిగినకొద్దీ క్వాంటిటీ నీ కూడా పెంచుతూ వచ్చాడు.అలా పని ఎక్కువగా అవడం తో మిర్చి బండి లో పని చేసేందుకు మరొకరికి ఉపాధి కల్పించేందుకు సిద్ధమయ్యాడు. మిర్చి బండి ప్రారంభం చేసి ఆ కొత్తలో రెండు, మూడు కిలోల పిండి మాత్రమే అమ్మేవాడు ఇప్పుడు అది పదింతలు పెరిగింది, ప్రస్తుతం ఈ పరుశరాములు మిర్చి బండి వద్ద మిర్చి తో పాటు ఆలు బజ్జీ, కోడిగుడ్డు బజ్జీలు, గారెలు, సర్వపిండి దొరకడం తో అన్ని కలిపి ప్రతి రోజు 20 కిలోల పిండి నీ అమ్ముతున్నట్లు పరుశరాములు తెలిపాడు.పనులు లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి వారు కూడా ఇలాంటి ఏదైనా చిరు వ్యాపారాన్ని ప్రారంభించి ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధి లేదు అని ప్రాణాలు తీసుకుంటున్న యువత ఇలాంటి చిరు వ్యాపారాలపై దృష్టి పెట్టి సంతోషంగా జీవించండి. ఇది తెలివైన వ్యాపారం తక్కువ ఖర్చుతో ఎక్కువ డబ్బులు సంపాదించడం, అలాగే ఉపాధి కల్పించడం మీరు కూడా మీ ప్రాంతాల్లో ఇలాంటి వ్యాపారం ప్రారంభించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేయండి చేతినిండా పైసలు ఉంటాయి. లక్ష్మీదేవి తలుపు తడుతుంది.

# స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ఆధునిక కెన్నెల్‌శ్రీ ప్రారంభం



మహబూబ్నగర్ జిల్లా పోలీస్ శాఖలో స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఆధునిక కెన్నెల్ జిల్లా ఎస్పీ డి.జానకి, శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ రు మాట్లాడుతూ, నేర నియంత్రణలో స్నిఫర్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేలుడు పదార్థాల గుర్తింపు, అనుమానాస్పద వస్తువుల పరిశీలన వంటి సందర్భాల్లో జాగిలాలు పోలీసులకు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపారు. "సింధు" ఇప్పటికే శిక్షణ పొందిన నైపుణ్యంతో భద్రతా చర్యల్లో కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. సింధు కోసం ఏర్పాటు చేసిన ఈ కెన్నెల్ ను ఆధునిక సదుపాయాలతో నిర్మించామని, ఇందులో శుభ్రత, సరైన గాలి ప్రవాహం, విశ్రాంతి కోసం అనుకూల వాతావరణం, తాగునీరు మరియు శిక్షణకు అవసరమైన వసతులు కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి డాగ్ స్క్వాడ్ (జాగిలాల దళం)ను అభివృద్ధి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని శిక్షణ పొందిన జాగిలాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఔః రత్నం, ఒఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఖీఎ లు కృష్ణయ్య, పోలీస్ అధికారులు, జాగిలాల దళం సిబ్బంది పాల్గొన్నారు.

## కీసరగుట్ట రెడ్డి భవనానికి రూ. లక్ష విరాళం అందజేసిన ఉమ్మడి కీసర మండల మాజీ జెడ్పిటిసి ముప్పు రామిరెడ్డి



కీసర (ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన కీసరగుట్టలో నిర్మిస్తున్న రెడ్డి భవన నిర్మాణానికి విరాళాల పరంపర కొనసాగుతోంది. శనివారం ఉమ్మడి కీసర మండల మాజీ జెడ్పిటిసి ముప్పు రామిరెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. భవన నిర్మాణ నిధి కోసం ఆయన లక్ష రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కీసరగుట్టలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. ముప్పు శ్రీనివాస్ రెడ్డి, రామిడి ప్రభాకర్ రెడ్డి, కీసరగుట్ట రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు. గుర్రం మల్లారెడ్డి భూదాత, పన్నాల బాల్ రెడ్డి, నల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సామాజిక ప్రయోజనం కోసం నిర్మిస్తున్న ఈ భవనానికి ముప్పు రామిరెడ్డి అందించిన సహకారాన్ని ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడానికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

## ఈసీఐఎల్‌లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్

# శిక్షణ తరగతులు

**- మే 4 నుంచి ఉచిత ఇంగ్లీష్ శిక్షణ: సద్వినియోగం చేసుకోవాలని జేఏసీ పిలుపు**

కాప్రా (ప్రశ్న న్యూస్)ఈసీఐఎల్ పరిధిలోని విద్యార్థులు, యువత, మహిళల కోసం ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ జేఏసీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈసీఐఎల్ ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 4వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు. ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుంచి 7:00 గంటల వరకు. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ (డా. బి.ఆర్. అంబేద్కర్ లైబ్రరీ భవనం), ఎస్‌బీఐ బ్యాంకు పక్కన, ఎన్ఎఫ్‌సీ రోడ్డు, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యం ఎంతో అవసరమని, నిరుద్యోగులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలు లేదా రిజిస్ట్రేషన్ కోసం ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు: 7842419367, 9951754975, 9866540816.

## వాహన చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**- 3 బైకులు స్వాధీనం**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీర ప్రసాద్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన చోరీలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఐ వీర ప్రసాద్ తెలిపారు. కొడిముంజ గ్రామంలో ఇటీవల జరిగిన వాహన చోరీ కేసును పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.సీఐ వివరాల ప్రకారం... వేములవాడ ప్రాంతంలో జరుగుతున్న వాహన చోరీలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రత్యేక గస్తీ, తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను వాహన చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు.అరెస్టైన నిందితుడు దామ పవన్ అలియాస్ పవన్ కళ్యాణ్ (గోదావరిఖని నివాసి)గా గుర్తించారు. అతని వద్ద నుంచి మొత్తం 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.ఈ కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రామ్మోహన్, పీసీ తిరుపతి, పీసీ ఇమ్రాన్‌లను సీఐ అభినందించారు.ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ వీర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## యాదవ సమాజ సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా

**- అఖిల భారత యాదవ మహాసభ వేములవాడ గ్రామీణ మండలాధ్యక్షులు : కొండవేని తిరుపతి యాదవ్**

**- వేములవాడ రూరల్ మండల యాదవ సంఘానికి నూతన కమిటీ ఎన్నిక**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు ఏ.టి. యాదవ్ ఆధ్వర్యంలో శనివారం యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫాజుల్ నగర్‌కు చెందిన కొండవేని తిరుపతి యాదవ్ (చెక్కరి)ను మండల అధ్యక్షుడిగా, అదే గ్రామానికి చెందిన దండవేణి నాగరాజును ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కొండవేని తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు ఏ.టి. యాదవ్ కు, సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సమాజ ఐక్యతను బలపరచడం, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని అన్నారు. యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. సమాజ సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్లతో చిల్లపల్లెలో ఆనందం.

**- శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో ప్రతి పేదవాడి కల నెరవేర సమయం.**

**- ఇందిరమ్మ ఇండ్లతో కొత్త ఆశలు. - పేదవాడి కళ నెరవేరిన సమయం.**

**- ఇందిరమ్మ ఇండ్ల పనులకు శ్రీకారం చుట్టిన చిల్లపల్లి . - సర్పంచ్. గోపి సంతు.**





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలంలోని చిల్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అక్కపాక నిర్మల ఇంటి స్థలంలో ఈ రోజు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపు సంతోష్ కుమార్ స్వయంగా సబ్బలి తో తవ్వి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కంచు మల్లేష్ , గ్రామస్థులు పాల్గొని పనుల ప్రారంభాన్ని అభినందించారు. లబ్ధిదారులకు త్వరితగతిన ఇల్లు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వడమే నా లక్ష్యమని శ్రీధర్ బాబు కొనియాడారు శీను బాబు మా నాన్న ఆశయ సాధనలో మేము పని చస్తామనితెలియజేసినారుఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## విద్యార్థుల కృషి అభినందనీయం

**- కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్.**



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం కన్నాల హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.గత రెండు సంవత్సరాలనుండి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నందుకు , పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న కృషి చాలా గొప్పది అన్నారు.ఈ సంవత్సరం మంథని మండలం లో జిల్లా పరిషత్ పాఠశాల లో రెండవ టాపర్గా నిలిచి 545 మార్కులు సాధించి కన్నాల జడ్పీహెచ్ఎస్ మొదటి స్థానం లో నిలిచిన తస్మిరా ను తల్లి, తండ్రి సమక్షంలో శాలువా తో ఘనంగా సన్మానం చేసారు.అలాగే శ్రీవన్, రాంచరణ్, అభిరుద్, వర్షిత్, అంజలి, అలీషా తదితరులు 500 లకు పైన మార్కులు సాధించడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినందించారు.ఇంకా ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు కానుగంటి శ్రీనివాస్, వార్డ్ మెంబెర్ కీర్తన, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన సూపర్ సమ్మర్ క్యాంప్.





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల లో టీ ఫైబర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన సూపర్ సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్ ప్రధానంతో ముగిసింది . గత వారం నుండి పాఠశాలలో 70 మంది విద్యార్థులకు రెండు బ్యాచ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , రోబోటిక్స్ పైన శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఎలా వినియోగించుకోవాలి , రోబోటిక్స్ తయారీ, ప్రోగ్రామింగ్, సెన్సార్ లాంటి వివిధ అంశాలపై టి ఫైబర్ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని టి ఫైబర్ ప్రతినిధులు తెలియజేశారు. విద్యార్థులకు వేసవి కాలంలో ఈ శిక్షణను ఏర్పాటు చేసినందుకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుదాడి సుమలత, టీ ఫైబర్ సూపర్ టీచర్ ప్రతినిధులు రాహుల్, వరుణ్, ధీరజ్, రామస్వామి, రమ్య, ఝాన్సీ, మనోజ్ పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు

## గజ్వేల్ బిడ్డ సాహిత్ లడఖ్ శిఖరంపై విజయం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** మన గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌కు చెందిన సాహిత్ తన అచంచల సంకల్పం, ధైర్యసాహసాలతో తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడు. శోభారాణి, పురాణం శ్రీనివాస్ కుమారుడైన అతను, తన లక్ష్యాన్ని సాధించేందుకు కష్టాలను లెక్కచేయకుండా ముందుకు సాగాడు. 2026 ఏప్రిల్ 12న గజ్వేల్ నుండి 100సీసీ హీరో ప్యాషన్ ప్రో బైక్‌పై తన ప్రయాణాన్ని ప్రారంభించిన సాహిత్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటార్ రహదారి అయిన ఉంలింగ్ లా పాస్ (19,024 అడుగులు / 5,798 మీటర్లు) ను విజయవంతంగా చేరుకున్నాడు. తక్కువ ఆక్సిజన్ స్థాయులు, ఎముకలు గడ్డకట్టించే చలి, ప్రమాదకరమైన మలుపులు, చెదిరిపోయిన రహదారులు, మనసును పరీక్షించే నిశ్శబ్ద పరిస్థితులను ఎదుర్కొంటూ ఈ సాహస యాత్రను పూర్తి చేశాడు. అతని పట్టుదల, ధైర్యం ఈ ప్రయాణాన్ని చరిత్రగా మార్చాయి. 2026 ఏప్రిల్ 28న అతను గిన్నెస్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సంపాదించి తన జీవితంలో అత్యంత గొప్ప విజయాన్ని సాధించాడు. ఈ అద్భుత విజయంపై గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలు, స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నారు. సాహిత్ వంటి యువత మన సమాజానికి స్ఫూర్తి, తెలంగాణకు గర్వకారణం.

## వారాహి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ వారాహి అమ్మ వారి ట్రస్టు వారి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ వారాహి దేవి సమేత ప్రత్యంగిరా దేవి, శరభేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు. శ్రీ వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా వేద పండితులు, శ్రీ వారాహి అమ్మ ట్రస్ట్ చైర్మన్ మాతృ శ్రీ మమతమ్మ మాట్లాడుతూ వారాహి అమ్మ వారి ఏకశిలా విగ్రాహమని దేశంలోనే అరుదైన ప్రతిమ అని, ఎన్నో శక్తులు కలిగిన వారాహి అమ్మవారి దర్శనం చేసుకుంటే కష్టాలు తొలిగి, జీవితం సుకమయమవుతుందని అన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన రజియా బేగం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు ని సిద్ధిపేట క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ రజియా బేగం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో కోఆప్షన్ మెంబర్‌గా ఈసారి అవకాశం కల్పించాలని ఆమె వినతిపత్రం సమర్పించారు. దీనిపై హరీష్ రావు సానుకూలంగా స్పందించి, విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ భేటీ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## యువత ఉచిత శిక్షణను

# సద్వినియోగం చేసుకోవాలి

**- గజ్వేల్ ఏసిపి నరసింహులు**




**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని గజ్వేల్ ఏసిపి నరసింహులు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో గల ఎసిపి కార్యాలయంలో శనివారం రాచకొండ సొల్యూషన్స్( కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్) ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ కు సంబంధించిన పోస్టర్లను, స్టడీ మెటీరియల్ రాచకొండ గ్రూప్స్ చైర్మన్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసిపి నరసింహులు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని తపన ఉన్నా శిక్షణ అందించేవారు లేక ప్రవేశ పరీక్షల్లో రాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి గజ్వేల్ పట్టణంలో ప్రతిష్టాత్మకంగా పేద నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యసాధన కొరకు రాచకొండ ప్రశాంత్ అందిస్తున్న ఉచిత కాంపిటేటివ్ కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఇంతగానో కష్టపడుతుంటారని, వారి కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. జీవితం ఎంతో విలువైందని... సమయాన్ని వృధా చేయకుండా ఉద్యోగ సాధన ధ్యేయంగా అడుగులు వేయాలన్నారు. కాగా రాచకొండ కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్లో నిరుద్యోగ యువత కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వడం పట్ల యాజమాన్యాన్ని అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాచకొండ సొల్యూషన్స్ ప్రతినిధులు శ్రీనివాస్, రమణాకర్, రామకృష్ణ, శ్రీ సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

**- మాజీ మంత్రి హరీష్ రావు**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు చోటుచేసుకున్నాయి. సిద్ది పేట జిల్లాలోని అక్కారం గ్రామంలో రెండవ తేదీ నాడు నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ ఫోక్ సింగర్, ప్రజా గాయకుడు బుడిగే ఎల్లం (యూట్యూబర్ ) మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బుడిగే ఎల్లం మాట్లాడుతూ గతంలో సొంత పార్టీని విడిచి కాంగ్రెస్‌లో చేరిన తాను, రెండు సంవత్సరాల పాటు పనిచేసిన అనంతరం బీఆర్ఎస్ పార్టీని మించిన పార్టీ తెలంగాణలో లేదని భావించి తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డి మార్గదర్శకత్వంలో, గజ్వేల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బెండే మధు నాయకత్వంలో ఈ చేరికలు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అలాగే మాట్లాడిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలంగాణ అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ పాత్ర కీలకమని, కే. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైందని విమర్శిస్తూ, అభివృద్ధి కోసం మళ్లీ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అక్కారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

## ఫైట్ మాస్టర్ దర్శకత్వంలో...

# రేపు పట్టాలెక్కుతున్న గోపీచంద్ కొత్త చిత్రం




యాక్షన్ హీరో గోపీచంద్ తన కెరీర్‌లో వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నారు. ప్రస్తుతం 'భరత వర్ష' అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్న ఆయన, తాజాగా తన 34వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా ద్వారా ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకుడిగా పరిచయం కాబోతుండటం విశేషం. టాలీవుడ్‌లో సంచలన విజయాలకు కేరాఫ్‌గా నిలిచిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విభిన్నమైన కథలతో, కమర్షియల్ హంగులను జోడించి భారీ చిత్రాలను నిర్మించే విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డిల 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ రాబోతోంది. ఇది ఒక హై-బడ్జెట్ ఎపిక్ యాక్షన్ డ్రామాగా, భారీ స్థాయిలో రూపుదిద్దుకోనుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. నారింజ రంగులో మండిపోతున్న ఆకాశం, భారీగా ప్రకాశిస్తున్న సూర్యుడు, ఒక రాతి శిఖరంపై రాజసంగా నిలబడి ఉన్న నల్ల చిరుతపులి.. ఇలా పోస్టర్ మొత్తం ఒక పవర్‌ఫుల్, మైథిక్ ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. చిరుత శరీరంపై రహస్య భాషను తలపించేలా మెరుస్తున్న గీతలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ చిత్రం ముడి శక్తి, ఉత్కంఠభరితమైన యాక్షన్‌తో నిండి ఉంటుందని పోస్టర్ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో అత్యంత డిమాండ్ ఉన్న యాక్షన్ కొరియోగ్రాఫర్లలో ఒకరైన వి.వెంకట్, ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన యాక్షన్ డ్రైవ్‌తో కూడిన కథను సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. Gopichand34 పూజా కార్యక్రమాలు రేపు అనగా, ఆదివారం జరగనున్నాయని చిత్ర బృందం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కు అత్యుత్తమ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. శామ్‌దత్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, శామ్ సి.ఎస్. సంగీతాన్ని సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్లు రామకృష్ణ-మోనిక ఈ చిత్రానికి పనిచేయనున్నారు. గోపీచంద్ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.

# ఆధ్యాత్మిక రహస్యాల చుట్టూ తిరిగే 'అగధ'



ఆధ్యాత్మిక రహస్యాలు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంటాయి .. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తూనే ఉంటాయి. దైవిక శక్తులు .. అవి చూపించే ప్రభావం చుట్టూ ఈ తరహా కథలు నడుస్తూ ఉంటాయి. ఇలాంటి కథలు గతంలో ఎమ్మెస్ రాజు బ్యానర్లో రూపొందాయి. కథాకథనాల పరంగా అలరిస్తూ, బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను నమోదు చేశాయి. అలాంటి ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'అగధ'.టైటిల్ తో .. ఆ టైటిల్ ను డిజైన్ చేసిన తీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమా ఇది. సీనియర్ నటి మంజుల మనవరాలు .. వనిత విజయ్ కుమార్ కూతురు 'జోవిక' ఈ సినిమాలో ప్రధానమైన పాత్రను పోషించింది. రీసెంటుగా వదిలిన ఆమె పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఉల్కా గుప్తా .. కామాక్షి భాస్కర్ల పోస్టర్లు కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచాయని చెప్పాలి. ఆదివరహా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆధ్యాత్మిక రహస్యాలు .. దైవిక శక్తుల చుట్టూ తిరిగే కథ ఇది. అందువలన గ్రాఫిక్స్ కి ఎక్కువ అవకాశం ఉన్న కంటెంట్ ఇది. సినిమా నిడివిలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయని చెబుతుండటం ఆడియన్స్ లో మరింత ఉత్కంఠను పెంచుతోంది. 85 రోజుల పాటు షూటింగు జరుపుకున్న ఈ సినిమా, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా, సంచలనాన్ని సృష్టించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.

# అట్టహాసంగా బెల్లంకొండ రిసెప్షన్..

## - సందడి చేసిన సినీ, రాజకీయ ప్రముఖులు



టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన బ్యాచిలర్ జీవితానికి గుడ్‌బై చెప్పి కావ్య రెడ్డితో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ వివాహ వేడుక జరిగింది. ఈ శుభవార్తతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 29న తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం సన్నిధిలో ఈ పెళ్లి అట్టహాసంగా జరిగింది. వేదమంత్రాల మధ్య సాయి శ్రీనివాస్ మూడు ముళ్లు వేసి కావ్యను తన జీవిత భాగస్వామిగా స్వీకరించారు. ఈ వేడుకకు ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. పెళ్లి అనంతరం మే 1న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా వెడ్డింగ్ రిసెప్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం సినీ, రాజకీయ ప్రముఖులతో కళకళలాడింది. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. రిసెప్షన్‌కు చిరంజీవి, నాగార్జున, మోహన్ బాబు, నాగ చైతన్య, కాజల్ అగర్వాల్, గోపీచంద్, శ్రీకాంత్, తరుణ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. అలాగే అలీ, నిర్మాత దిల్ రాజు, రాజకీయ నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. ఈ వేడుకలో చిరంజీవి, మోహన్ బాబు వంటి సినీ దిగ్గజాలకు బెల్లంకొండ కుటుంబం పాదాభివందనం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ క్షణాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సాయి శ్రీనివాస్ తన పెళ్లి ఫోటోలను పంచుకుంటూ తన భార్యను అభిమానులకు పరిచయం చేశారు. ఆమెను "పవర్‌ఫుల్" అని అభివర్ణించడం అభిమానులను ఆకట్టుకుంది. ఈ జంట క్యూట్‌గా కనిపిస్తూ అందరి మనసులు గెలుచుకుంటోంది. ప్రస్తుతం ఈ పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఆ విషయాన్నే

# మర్చిపోయా!



దళపతి విజయ్‌తో సన్నిహిత సంబంధాల్ని కొనసాగిస్తూ తమిళనాట వార్తల్లో నిలుస్తున్నది అగ్ర కథానాయిక త్రిష. తాజాగా సూర్య 'కరుప్పు' సినిమా విషయంలో నిర్మాతలకు, త్రిషకు మధ్య రాజుకున్న వివాదం చర్చనీయాంశంగా మారింది. 'కరుప్పు' చిత్రం ఈ నెల 14న తమిళ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతున్నది.ఇరవైఏండ్ల విరామం తర్వాత సూర్యతో కలిసి త్రిష నటించిన చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలకు త్రిషను దూరంగా పెట్టినట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతున్నది. ఇటీవల నిర్వహించిన ఆడియో వేడుకలో కూడా త్రిష కనిపించలేదు. వేదికపై ఆమె గురించి ఎవరూ మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో చిత్రబృందంపై విమర్శలొస్తున్నాయి.తాజాగా త్రిష తాలూకు లుక్ వీడియోను శుక్రవారం రిలీజ్ చేశారు. దీనిపై త్రిష వ్యంగ్యంగా స్పందించింది. ఈ సినిమాలో తాను నటించిన విషయాన్ని మర్చిపోయానని, కనీసం ఈ వీడియోతో గుర్తుచేసినందుకు థాంక్స్ అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. దీంతో నిర్మాతలు, త్రిష మధ్య నిజంగానే వివాదాలు తలెత్తాయని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.

# డాక్టర్ ఆత్మఘోష

## - మలయాళ

కథానాయిక భావన ప్రధాన పాత్రలో నటించిన 'హంట్' చిత్రం తెలుగులో 'డాక్టర్ కీర్తి ఎంబీబీఎస్ ఎంఎస్' అనే పేరుతో అనువాదమవుతున్నది. షాజీ కైలాస్ దర్శకుడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కలకత్తా వైద్యురాలి రేప్ అండ్ మర్డర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మే 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే టీజర్‌ను నిర్మాతలు స్వర్ణకుమారి దొండపాటి, ఎం.విశ్వనాథ రెడ్డి విడుదల చేశారు. ?

ఈ సినిమాలోని భావోద్వేగాలు హృదయాల్ని కదిలిస్తాయని, ఆ వైద్యురాలి ఆత్మఘోషను ఆవిష్కరిస్తూ కథ సాగుతుందని మేకర్స్ తెలిపారు. రెంజి పనికర్, చందునాథ్, డెయిన్ డేవిస్, అనుమోహన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కైలాస్ మీనన్, దర్శకత్వం: షాజి కైలాస్.



# ఓటీటీ తెరపైకి ప్రదీప్ రంగనాథన్ మూవీ!



ప్రదీప్ రంగనాథన్ కి యూత్ లో మంచి క్రేజ్ ఉంది. ఆయన నుంచి ఒక సినిమా వస్తోందంటే, యూత్ ఆసక్తితో ఎదురుచూస్తూ ఉంటుంది. అందువలన యూత్ ను దృష్టిలో పెట్టుకునే ఆయన తన సినిమాలను ప్లాన్ చేసుకుంటూ ఉంటాడు. ఆయన నుంచి వచ్చిన తాజా చిత్రమే 'లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ'( వా×ఖ). విఘ్నేశ్ శివన్ తన సొంత బ్యానర్ పై తెరకెక్కించిన సినిమా ఇది. కృతి శెట్టి కథానాయికగా అలరించిన ఈ సినిమాను, ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లలో విడుదల చేశారు. గతంలో ప్రదీప్ చేసిన సినిమాలన్నీ చాలా తేలికగా 100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాయి. దాంతో ఈ సినిమా కూడా ఒక రేంజ్ లో వసూళ్లను కొల్లగొడుతుందని భావించారు. ఆ నమ్మకంతోనే 100 కోట్ల వరకూ ఖర్చు పెట్టారు. అయితే ఈ సినిమా 60 కోట్ల దగ్గరే తన జోరును తగ్గించింది. 100 కోట్ల మార్క్ ను టచ్ చేయలేకపోయింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 6వ తేదీ నుంచి ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన 'అమెజాన్ ప్రైమ్' నుంచి వచ్చేసింది. ఇది లవ్ స్టోరీనే .. కాకపోతే ఇప్పటి కాలానికి చెందిన ప్రేమకథ కాదు. 2040లో ప్రేమలు ఎలా ఉండబోతున్నాయి? అనే విషయాన్ని చూపించే ప్రయత్నం చేశారు. అప్పటి యూత్ ధోరణి ఎలా ఉంటుంది? వాళ్ల ఆలోచన విధానం ఎలా ఉంటుంది? అనేవి వినోదభరితంగా చూపించే ప్రయత్నం చేశారు. సైంటిఫిక్ రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా, ఓటీటీ వైపు నుంచి ఎన్ని మార్కులు తెచ్చుకుంటుందనేది చూడాలి.

# గ్రామదేవతలకు వందనం



తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. జి.జి.విహారి దర్శకుడు. రవి పనస నిర్మాత. పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ఈ సినిమా నుంచి 'శరణమన్న శరణం' అనే పాటను విడుదల చేశారు. మేడే సందర్భంగా శ్రామిక శక్తిని గౌరవిస్తూ ఈ పాటను రూపొందించారు. హాయ్ కేపీ స్వరపరచిన ఈ పాటను కుమార వాగ్దేవి ఆలపించారు. శ్రామికులు ఆరాధించే గ్రామ దేవతలను భక్తిపూర్వకంగా స్మరిస్తూ, సబ్బండ కులాల శ్రమజీవుల గుండెచప్పుడుగా ఈ పాట ఆకట్టుకుంటుందని, మట్టి మనుషులను కంటికి రెప్పలా కాపాడే దేవతలకు వందనమిదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: హాయ్ కేపీ, కథ, దర్శకత్వం: జీజీ విహారి.

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై

# ఆరోపణలు నిరాధారం

- వ్యక్తిగత గొడవను రాజకీయ లబ్ధికి వాడొద్దు - ఘాటుగా స్పందించిన ఉపేందర్
- సర్పంచ్ కాని వ్యక్తి జేపీసీ అధ్యక్షుడా? ఇది మోసం కాదా??
- వ్యక్తిగత గొడవపై సుంకె రవి శంకర్ చిల్లర రాజకీయాలు
- స్తంభంపల్లి మాజీ ఎంపీటీసీ : అక్కెనపల్లి ఉపేందర్ ఫైర్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో జరిగిన వ్యక్తిగత గొడవను రాజకీయ రంగులోకి తేవడం అత్యంత దురదృష్టకరమని, ఇది పూర్తిగా “చిల్లర రాజకీయ డ్రామా” అని స్తంభంపల్లి మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్ తీవ్రంగా విమర్శించారు.శనివారం బోయినిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందిస్తూ--- స్తంభంపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి అశోక్‌పై అదే గ్రామానికి చెందిన అక్కెనపల్లి కరుణాకర్ దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అయితే, ఈ విషయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం దారుణమని మండిపడ్డారు.చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఈ ఘటనను అడ్డంగా పెట్టుకొని గ్రామానికి వచ్చి పరామర్శ పేరుతో రాజకీయ కక్షసాధింపునకు దిగడం సిగ్గుచేటని ఉపేందర్దుయ్యబట్టారు.ముఖ్యంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై ఆధారరహిత ఆరోపణలు చేయడం పూర్తిగా నిరాధారమని ఖండించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడిపై ఇలాంటి విమర్శలు చేయడం వెనుక రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.అదే సమయంలో అక్కెనపల్లి కరుణాకర్ వ్యవహారాన్ని కూడా ఆయన తీవ్రంగా ఎత్తిచూపారు. సర్పంచ్ కాని అక్కెనపల్లి కరుణాకర్ అనే వ్యక్తి సర్పంచ్ హోదాలో రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేపీసీ) అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ మీడియా సమావేశాలు నిర్వహించడం, పత్రికల్లో వార్తలు ప్రచురింపజేయడం, కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయడం వంటి చర్యలు చీటింగ్ కిందికి రావా?అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులు పొందేందుకు తాను సర్పంచ్ అన్నట్లు నటించడం మోసం కాదా?? అని నిలదీశారు.ఇప్పటికైనా వ్యక్తిగత గొడవలను రాజకీయ లాభాల కోసం వాడుకునే ప్రయత్నాలు మానుకోవాలని, ప్రజలను తప్పుదారి పట్టించే చీప్ రాజకీయాలకు తెరదించాలని ఉపేందర్ కఠినంగా హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ నల్లమోహన్, దుంద్రపల్లి సర్పంచ్ జంగం అంజయ్య, స్తంభంపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి వెంకటేష్, మండల కాంగ్రెస్ నాయకులు ఎండి బాబు, కోడం రాములు, గోగూరి అనంతరెడ్డి,అక్కెనపల్లి రమేష్,కందాడి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో

# మండల ప్రజలు: ఎమ్మార్వో



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మార్వో బిక్షపతితో పాటు,నోడల్ అధికారి,రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు
రెవెన్యూ అధికారులు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలలో ఇందిరమ్మ ఇళ్లు, 2 యూనిట్ల ఉచిత కరెంటు,మహాలక్ష్మి,రైతు భరోసా,రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా అమలవుతున్న అన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజా పాలనలో ప్రజలకు తెలియజేశారు. అనంతరం తిరుమలగిరి మండలానికి సంబంధించిన నలభై నాలుగు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తిరుమల గిరి ఎమ్మార్వో బిక్షపతి, డిప్యూటీ ఎమ్మార్వో హరిక,మండల సర్వేయర్ వెంకటేష్,చంద్రశేఖర్,నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా సెషన్ కోర్టు హాల్ ప్రారంభం

- కేసుల వేగవంతమైన పరిష్కారానికి నూతన హాల్
- జస్టిస్ కె.లక్ష్మణ్




**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జిల్లా, సెషన్ కోర్టు హాల్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా ఉన్నతాధికారులు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది హాజరై వేడుకను విజయవంతం చేశారు. ఈ నూతన కోర్టు హాల్‌ను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. లక్ష్మణ్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు జిల్లా కలెక్టర్ మను చౌదరి కలిసి రిబ్బన్ కత్తిరించి అధికారికంగా ప్రారంభించారు.కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంప్రదాయబద్ధంగా వేడుకను ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులు నూతనంగా నిర్మించిన కోర్టు హాల్‌లోని వసతులను, న్యాయమూర్తుల ఛాంబర్లను పరిశీలించారు. కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలిస్తూ, న్యాయ వ్యవస్థలో మరింత పారదర్శకత, సమర్థత పెరగడానికి ఈ వసతులు దోహదపడతాయని పేర్కొన్నారు.పెరుగుతున్న కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని, కక్షిదారులు మరియు న్యాయవాదులకు మెరుగైన వసతులు కల్పించడం, విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యంగా ఈ నూతన కోర్టు హాల్‌ను నిర్మించినట్లు అధికారులు వివరించారు. ఈ సౌకర్యంతో కేసుల పరిష్కారం మరింత త్వరగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త కోర్టు హాల్ ప్రారంభంతో జిల్లా న్యాయ వ్యవస్థకు మరింత బలం చేకూరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోడలో శవం,గూడు వదిలి పారిపోయిని హంతకుడు:డిసిపి

- ఇద్దరి మధ్య గోడవ,గుట్టు చప్పుడు కాకుండా గోడలో శవం దాచిన నరహంతకుడు,
- అద్దె ఇల్లు వదిలి పారిపోయిని వ్యక్తి,”4”నెలలు తర్వాత ఓనర్ ఫిర్యాదుతో వెలుగు చూసిన సంఘటన
- ఆలిని వేలెత్తి చూపినందుకు హత్య చేసి,సినీ ఫక్కీలో గయాబ్
- నో క్లూస్,ఫిర్యాదుతో వెలుగు చూసిన సంఘటనను ఛాలేంజ్ గా తీసుకున్న నేరేడు మేట్ పోలీసులు
- పక్షంలో పసిగట్టి అదుపులోకి నిందుతుడ్ని తీసుకున్న పోలీసులు,అభినందించిన మల్కాజిగిరి జోన్ డిసిపి:సిహెచ్.శ్రీధర్





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరంలో గుండె కాయ లాంటి ది.ఈ మెట్రో పాలిటిన్ సిటిలో సుమారు కోటి ముప్పై లక్షల జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.కానీ దేశంలోనే అత్యంతకంగా నేర పరిశోధనల చిక్కు ముడులు విప్పే మేధావులు కేవలం తెలంగాణ పోలీసులు. గతంలో కేంద్ర హోం శాఖ కూడా ఈ విషయాన్ని వెల్లడించింది.అందుకే కాబోలు రాష్ట్ర పోలీసులు సంఘటన స్థలంలో నేరస్థులు ఎలాంటి క్లూస్ వదలకపోయినా సరే గంటలు, రోజుల వ్యవధిలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాసులు క్రైం చిక్కుముడిని ఇట్టే ఇప్పేస్తారు.ఈ నేపథ్యంలో మల్కాజిగిరి జోన్ నేరేడు మెట్ ఠాణా పరిధిలో నాలుగు నెలల క్రితం జరిగిన హత్య కేసును నేరేడ్ మెట్ పోలీసులు చాకచక్యంగా చేదించారు.మద్యం మత్తులో వ్యక్తిని హతమార్చి,అద్దె ఇంట్లో వంటింట్లో ఓ మూలలో గోడను నిర్మించి అందులో మృతదేహాన్ని అమర్చి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మల్కాజ్ గిరి జోన్ డీసీపీ శ్రీధర్ నిన్న తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు.నేరేడ్ మెట్ జె.కే.కాలనీలో ఉండే మల్లేశం.ఆయన స్నేహితుడు వెంకటరాములు. ఇద్దరు దినసరి కూలీలు,పని దొరకన్నప్పుడు ఇద్దరు కలిసి మద్యం సేవించడం వీరి ఆనావాయితి.ఒక రోజు ఇద్దరు మధ్య జరిగిన ఘర్షణలో మల్లేశం అనే వ్యక్తి వెంకటరాములు పై కర్రతో విచక్షణరహితంగా దాడికి పాల్పడి హతమార్చినట్లు మల్కాజ్ గిరి జోన్ డిసిపి శ్రీధర్ తెలిపారు.వెంకట రాములుని హతమార్చడమే కాకుండా ఎవరికి అనుమానం రాకుండా అతను అద్దెకు ఉంటున్న గదిలో రహస్యంగా సిమెంటు ఇటుకలతో గోడను నిర్మించి అందులో మృతదేహాన్ని కప్పి ఉంచినట్లు పోలీసులు పేర్కొన్నారు.సిద్దిపేటకు చెందిన మల్లేశం నేరేడుమెట్ ప్రాంతంలోని జె.కే.కాలనీలో నివాసం ఉంటూ ప్లంబర్ గా పనిచేస్తున్నట్లు,మహబూబ్ నగర్ కు చెందిన వెంకట రాములు మౌలాలిలో నివాసం ఉంటూ దినసరి కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డిసెంబర్ మాసంలో వెంకట రాములు,మల్లేశంలు దినసరి పని కోసం చూడగా పని దొరకపోవడంతో మద్యం దుకాణానికి వెళ్లి మద్యం తీసుకున్నారు.అనంతరం మల్లేశం ఉంటున్న గదికి వచ్చి మద్యం సేవిస్తున్న క్రమంలో మల్లేశం భార్య గురించి వెంకట రాములు అసభ్యంగా మాట్లాడడంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తి మల్లేశం కర్రతో వెంకటరాములు తల పై బాధడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ విషయం బయటకి పొక్కకుండా సిమెంట్ ఇటుకలు తీసుకువచ్చి ఆ గదిలోనే ఆయనను సమాధి చేశాడు. ఎక్కడైతే శవాన్ని పూడ్చాడో ఆ చోటలో గోడ నిర్మించి అందులో మృతదేహాన్ని అమర్చి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు.ఇంటి యజమాని ఇతరులకు ఇల్లు అద్దె ఇవ్వడంతో వాళ్ల వంటగదిని శుభ్రం చేస్తున్న క్రమంలో దుర్వాసన రావడంతో యజమానికి చెప్పారు.వెంటనే యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి పంపారు.ఈ ఘటన పై కేసు నమోదు చేసుకొని సెల్‌ఫోన్ డేటా ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మల్లేశం హత్య చేసినట్లు నిర్ధారణ చేసుకున్నారు. మొన్న శుక్రవారం అనుమానాస్పద స్థితిలో జేబీఎస్ ప్రాంగణం వద్ద తిరుగుతున్న క్రమంలో మల్లేశంను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు నేరేడు మెట్ పోలీసులు. అలాగే నిందితుడు మల్లేశం గతంలో తన సొంత కూతురి పై అత్యాచారం కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.మల్కాజిగిరి జోన్ డిసిపి సిహెచ్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎవ్వరికైనా ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారికి చెందిన పూర్తి వివరాలు సేకరించాలి,మరి ముఖ్యంగా ఆ వ్యక్తి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవల్సిన బాధ్యత ఓనర్ పై ఎంతైనా ఉందన్నారు.ఇవాళ రేపు నేరస్థులు సామాన్య ప్రజలు మధ్య ఉంటూనే వారి నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు.అందుకే ప్రజలే వారి నివాస ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద పరిస్థితుల్లో కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో వై.యాదగిరి రెడ్డి ఏసిపి,పి.సందీప్ కుమార్ ఇన్స్పెక్టర్,డిఐ,సిహెచ్: శ్రీనివాస్,ఎస్.సాయి అవినాష్ ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

# భాజపా మీటింగ్‌కి “లక్ష” టార్గెట్:ఈటెల రాజేందర్

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ఈ నెల 10న పెరేడ్ మైదానంలో ప్రధాని మోడీ నేతృత్వంలో జరగబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ గాయత్రి గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు లక్షమంది జన సమీకరణ మల్కాజ్గిరి పార్లమెంటు నుండే జరగనున్నట్లు వెల్లడించారు. కంటోన్మెంట్ ప్రాంతంలోనే సభ జరుగుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున జన సమీకరణ కోసం సన్నాహక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ?7,000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను మోడీ ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. రాబోయే హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా మోడీ ప్రసంగించనున్నట్లు తెలిపారు. దేశంలోనే రెండు సీట్లు మాత్రమే గెలిచిన భాజపా అధికారంలోకి వచ్చిన మాదిరిగానే రేపు బెంగాల్ ఫలితాలు కూడా ఉండనున్నాయని తెలంగాణలో సైతం భాజపా అధికారం చేజిక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రధాని మీటింగ్ కి మల్కాజిగిరి పార్లమెంటు నుండి లక్షమంది హాజరుకాబోతున్నారన్న ఈటెల..



తెలంగాణలో అధికారంలోకి వచ్చేంతవరకు బీజేపీ భారీగా కసరత్తు చేస్తోంది.నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయడానికి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో నిన్న ఎనిమిది మీటింగులు పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు.అన్ని గేటెడ్ కమ్యూనిటీలు,కాలనీలు, బస్తీలు,అపార్ట్మెంట్లో ఉన్న వారందరినీ ఆహ్వానిస్తున్నాము.ఈ నెల పదవ తారీఖున రోజు పొద్దున ఎల్బీనగర్ నియోజకవర్గం,మధ్యాహ్నం మేడ్చల్ అర్బన్ జిల్లా, సాయంత్రం కంటోన్మెంట్ లో సమావేశాలను ఏర్పాటు చేసుకున్నాం.ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా 365 రోజులు ప్రజలకు సేవ చేసే వ్యక్తి మన ప్రధాని నరేంద్ర మోడీ.అలాంటి వ్యక్తిని ఆశీర్వదించండి అని తెలంగాణ ప్రజలను కోరుతున్నాము.ప్రజలు, మేధావులు విద్యార్థులు కుల సంఘాలనేతలు కాలనీవాసులు అందరూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రధాని నరేంద్ర మోడీ మీటింగ్ కి హాజరుకావాలని విన్నపంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మా నాయకులందరూ కూడా ప్రజలను ఇంట్లో పెళ్ళి లెక్క ఆహ్వానించాలని కోరుతున్నాం.తెలంగాణ రాష్ట్రంలో 7 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు అధికారిక కార్యక్రమంలో ప్రజలకు అంకితం చేయనున్నారు. పెరేడ్ గ్రౌండ్ లో జరిగేది పూర్తి స్థాయి రాజకీయ సమావేశం. పశ్చిమ బెంగాల్లో రెండు సీట్ల నుంచి ఇప్పుడుఅధికారంలోకి రాబోతున్నాము.తెలంగాణ రాష్ట్రంలో కూడా అలసిపోము అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నాము. వెయ్యి కిలోమీటర్ల ప్రయాణమైనా.. ఒక్క అడుగుతో మొదలవుతుంది. బిజెపి ప్రస్థానం రెండు పార్లమెంటు సభ్యులతో మొదలై అప్రతిహతంగా కొనసాగుతుంది.కంటోన్మెంట్ సమస్యలను రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాము. రాష్ట్రంలో అన్ని అధికారాలు ముఖ్యమంత్రి రేవంత్ దగ్గర ఉన్నట్లు కేంద్రంలో ఉండదు. ఏ శాఖకు ఆ శాఖ మంత్రులు పరిష్కారాలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు భానుక నర్మదా,భనుక మల్లికార్జున్, భాజపా సీనియర్ నాయకులు బి.ఎన.శ్రీనివాస్,
తదితరులు పాల్గొన్నారు.

### రామగిరి పోలీస్ స్టేషన్ ముందు

# బైఠాయించిన బాధితులు

- నా కుమారుని చావుకు కారకులైన వారికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.



**మంథని ( ప్రశ్న న్యూస్)**ం మంథని డివిజన్ పరిధిలోని కుమారుని చావుకు కారకులైన వారిపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెయ్యల సాయితేజ కుటుంబ సభ్యులు శనివారం రామగిరి పోలీస్ స్టేషన్ ముందు బైటాయించారు. నిందితులంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, తమ కుమారుని చావుకు ఎవరు కారణమో పోలీసులకు ముందే తెలిసినా అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బైటపెట్టలేదని వారు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడు మృతిచెంది 13 రోజులు గడిచినా పోలీసులు కేసును ఎటూ తేల్చకుండా నిందితులను కాపాడుతున్నారని వారు ఆరోపిస్తూ న్యాయం కోసం స్టేషన్ ముందు బైటాయించి నిరసన తెలిపారు.

## ప్రజా పాలన సమావేశంలో ప్రతిపక్షానికి నో ఛాన్స్....!

- నీలం రవి ఆగ్రహం....!!
- అధికార పార్టీ ఆధిపత్యం - ప్రజా స్వామ్యానికి విరుద్ధం
- భీంగల్ మున్సిపల్ 9 వ వార్డు కౌన్సిలర్ : నీలం రవి విమర్శ
- ప్రతిపక్ష స్వరాన్ని అడ్డుకున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్ రవి ఆరోపణలు



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన సమావేశం వివాదానికి దారి తీసింది.స్థానిక సహస్ర ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ నీలం రవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.సమావేశంలో ప్రజలు, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా, కార్యక్రమాన్ని తొందరగా ముగించారని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన నేతలకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారని విమర్శించారు.“ఇది ప్రజాపాలన కార్యక్రమం అయితే అందరికీ మాట్లాడే హక్కు ఉండాలి. ఒక పార్టీకి మాత్రమే వేదికగా మార్చడం సరైంది కాదు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం మా బాధ్యత” అని నీలం రవి పేర్కొన్నారు.ప్రజల గొంతుకను వినకుండా సమావేశాలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. ఈ ఘటన భీంగల్ పట్టణంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# వాణిజ్య గ్యాస్ 'మంట'

- కమర్షియల్ సిలిండర్ పై వెయ్యి రూపాయల వాత
- హోటల్ ప్రియులకు చుక్కెదురు - తెలంగాణపై పడిన 'గ్యాస్' భారం
- హోటల్ రంగంపై 'పెను' ప్రభావం - ద్రవ్యోల్బణ సెగ.. సామాన్యుడికి ఇబ్బందే
- నాలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే వాణిజ్య రంగంపై భారం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్ ) కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ వైఫల్యంతో సామాన్యుడిపై ధరల భారం మరోసారి పంజా విసిరింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను అమాంతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఒక్కో సిలిండర్‌పై ఏకంగా రూ.993 నుండి రూ.1,000 వరకు ధర పెరగడం వ్యాపార వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిన్నటి వరకు రూ.2,321గా ఉన్న వాణిజ్య సిలిండర్ ధర, తాజా పెంపుతో ఒక్కసారిగా రూ.3,315 దాటిపోయింది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెనువెంటనే ఈ భారం వాణిజ్య రంగంపై పడటం గమనార్హం.

### తెలంగాణపై పడిన 'గ్యాస్' భారం..

తెలంగాణ రాష్ట్రంలో సైతం వాణిజ్య సిలిండర్ ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. భాగ్యనగరంలో వాణిజ్య సిలిండర్ ధర బ్లాక్ మార్కెట్లో దాదాపు రూ.1,500 అదనపు భారంతో ఇప్పుడు రూ.3,500ల నుండి 5వేల మార్కును అధిగమించింది. రవాణ ఖర్చులను కలుపుకుని ఈ ధర మరింత ఎక్కువగా చేసి అమ్ముతున్నారు. దానితో చిన్న వ్యాపారాలు నిర్వహించే వాళ్లకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

### హోటల్ రంగంపై 'పెను' ప్రభావం..

ఈ భారీ పెంపు ప్రభావం నేరుగా సామాన్య ప్రజలపై పడనుంది. హోటళ్లు, రెస్టారెంట్లు మరియు వీధి వ్యాపారులు (టిఫిన్ బండ్లు) పూర్తిగా గ్యాస్ వినియోగంపైనే ఆధారపడి ఉంటారు.

సిలిండర్ ధర పెరగడంతో టిఫిన్లు, భోజనం ధరలు 20శాతం నుండి 30శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే రూ.30కి అమ్ముతున్న టిఫిన్ ధరను రూ.50కి పెంచక తప్పని పరిస్థితి ఏర్పడిందని చిన్న తరహా వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానితో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆహారం దూరమవుతోంది.

### ద్రవ్యోల్బణ సెగ.. సామాన్యుడికి ఇబ్బందే..

వ్యాపార అవసరాలకు వాడే గ్యాస్ ధరలు పెరిగితే, అది పరోక్షంగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. రవాణా ఖర్చులు, హోటల్ ధరలు పెరగడం వల్ల సామాన్యుడి నెలవారీ బడ్జెట్ పై తీవ్ర ప్రభావం పడుతుంది. హోటల్ యజమానులు పెరిగిన ఖర్చులను కస్టమర్ల నుండే వసూలు చేయాల్సి వస్తుందని, దీనివల్ల మధ్యతరగతి ప్రజల బయటి ఆహారం భారంగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గృహ సిలిండర్ ధరలు పెరగకపోవడం కాస్త ఉపశమనమే అయిన బయట టిఫిన్ చేసే లేదా భోజనం చేసే సామాన్యుడికి మాత్రం ఈ 'వ్యాపార మంట' తప్పేలా లేదు. కేంద్ర ప్రభుత్వం, చమురు కంపెనీల ఈ నిర్ణయంపై వ్యాపార సంఘాలు పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర తొలగిస్తుండగా పేలుడు

**- ముగ్గురు జవాన్ల మృతి**



ఛత్తీస్‌గఢ్ (ప్రశ్న న్యూస్) ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గతంలో అమర్చిన శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) పేలడంతో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్ల ప్రాణాలు కోల్పోయారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మందుపాతరలు తొలగించే ఆపరేషన్ (డీమైనింగ్) నిర్వహిస్తుండగా శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు చేపట్టాయి. ఇందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా, అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. "ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాల సమాచారంతో వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశాం. కానీ, నేటి దురదృష్టకర ఘటనలో ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తున్న సమయంలో అది పేలింది" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహితంగా ప్రకటించిన తర్వాత ఇదే మొదటి పేలుడు కావడం గమనార్హం.

## ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం అలవాటు

**-వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్**



అమరావతి (ప్రశ్న న్యూస్) వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

## బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్

**- భారీగా ఓటింగ్ నమోదు**



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయింది. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ ప్రక్రియ జరిగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 15 బూత్‌లలో కలిపి సగటున 86.90 శాతం ఓటింగ్ నమోదైంది. మగ్రాహత్ (పశ్చిమ) నియోజకవర్గంలోని 11 బూత్‌లలో 86.11 శాతం, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 బూత్‌లలో 87.60 శాతం పోలింగ్ నమోదైనట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. తుది గణాంకాలు తేలిన తర్వాత పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రీపోలింగ్‌లో ఇది చాలా అధికమని వారు పేర్కొన్నారు. ఈసారి రెండు దశల్లో (ఏప్రిల్ 23, 29) జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 93 శాతం పోలింగ్ నమోదై స్వాతంత్ర్యం తర్వాత కొత్త రికార్డు సృష్టించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు... 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికి, బీజేపీ అధికారంలోకి వస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

# టైర్లు పగులుతున్నాయి...

# ప్రాణాలు పోయేటట్లు ఉన్నాయి

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ప్రమాదాలు**

**ఎప్పుడు ఏం అయితుందో అని భయాందోళనలో వాహనదారులు**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన రహదారులు, అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేస్తున్నాయి. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే సిరిసిల్ల, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న పదిర బ్రిడ్జ్ వద్ద పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి, అధికారుల నిర్లక్ష్యం కలిసివచ్చి ఈ మార్గాన్ని ప్రమాదాలకు కేంద్రబిందువుగా మార్చేశాయని వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదిర బ్రిడ్జ్ సమీపంలో రహదారి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాంక్రీట్ పోసి అలాగే వదిలేయడంతో, రోడ్డు పూర్తిగా అనియంత్రితంగా మారింది. రోడ్డుకు, బ్రిడ్జ్‌కు మధ్యలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ఈ గుంతల వల్ల టైర్లు పగిలిపోవడం, వాహనాలు అదుపు తప్పడం వంటి అనేక ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గం మీద ప్రయాణం అంటే వాహనదారులకు భయానక పరిస్థితిగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

స్థానికుల వివరాల ప్రకారం ఈ సమస్య నెలల తరబడి కొనసాగుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని వాహనదారులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, చర్యలు తీసుకోవడంలో పూర్తిగా



విఫలమయ్యారు. రోజుకు పదుల సంఖ్యలో చిన్నా, పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదాల్లో పలువురు గాయపడటంతో పాటు, వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇది సాధారణ రహదారి కాదు. సిరిసిల్ల, కామారెడ్డి వంటి ముఖ్య ప్రాంతాలను కలుపుతున్న ప్రధాన మార్గం కావడంతో రోజూ వందల సంఖ్యలో కార్లు, బైకులు, లోడింగ్ వాహనాలు ఇక్కడి మీదుగా ప్రయాణిస్తుంటాయి. అలాంటి కీలక రహదారిపై అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ పనులను తూతూ మంత్రంగా చేసి వదిలేయడమే కాకుండా, పనుల నాణ్యతపైనా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం పరిస్థితి చూస్తే, ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి, గుంతలను వెంటనే పూడ్చి రహదారిని సరిచేయాలని, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు విలువైనవని పాలకులు గుర్తించి ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం పూర్తి విరుద్ధంగా కనిపిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల, కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యంతో జరుగుతున్న ఇలాంటి పనులు ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే చర్యలు తీసుకోకపోతే, మరిన్ని ప్రమాదాలు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588